J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 07.08.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 10 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com




## భారతీయుల కల సాకారం..

# రామయ్య గుడికి శ్రీకారం



### గుండెగుండెలో మారుమ్రోగిన రామనామ ధ్వని

### భక్తిపారవశ్యంతో పులకించిన భారతావని

### మోడీ చేతుల మీదుగా మొదలైన రామమందిరం పని

అయోధ్య మెరిసింది.. భారతావని మురిసింది. మనదేశమే కాదు, ప్రపంచమంతా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూసిన ఆ శుభఘడియ రానేవచ్చింది. ఈనెల5 బుధవారం మధ్యాహ్నం 12.44 గంటలకు రామజన్మభూమిలో ప్రధాని మోడీ చేతులమీదుగా రామయ్య గుడికి శ్రీకారం జరిగింది. భారతీయుల దశాబ్దాల నాటి కల సాకారమైంది. 'జైశ్రీరామ్' అంటూ గుండెగుండెలో రామనామం మారుమోగింది. ప్రతి హృదయం పరవశించిపోయింది...అంతా రామమయంగా మారింది. (వార్త 3వ పేజీలో)

## మూడు రాజధానుల నిర్ణయం జగన్మోహనం

# మహా విశాఖే.. మన రాజధాని



### ➤ పాలనా రాజధానిగా విశాఖ ➤ శాసన రాజధానిగా అమరావతి ➤ న్యాయ రాజధానిగా కర్నూలు

జగన్ అంటే ఖచ్చితత్వం, జగన్ అంటే జనామోదం, జగన్ అంటే మొండి, జగన్ అంటే పట్టుదల, జగన్ అంటే తను అనుకున్నదే జరగాలి.. జగన్ అంటే వెనకడుగు వేయడు.. ఎస్.. అన్నీ నిజమే.. జగన్ అంటే ఒక అసాధ్యం, జగన్ అంటే ఒక నిజం... అన్నట్టుగానే సాగుతోంది ఆయన పాలన. మొదటి ఏడాదిలోనే ఆయన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే కాకుండా ఇవ్వని సంక్షేమ పథకాలనూ ప్రవేశపెట్టి, ఆర్థికంగా కష్టంగా ఉన్న సమయంలోనూ సంతృప్తికర స్థాయిలో సంక్షేమాన్ని అమలుచేసి దేశంలోని రాష్ట్రాలన్నీ ఏపీవైపు చూసేలా చేస్తున్న అనితరసాధ్యుడు జగన్. (మిగతా 11వ పేజీలో)






# బాబు 'రివర్స్' ట్రెండ్

### నిరసన తాను వ్యక్త పరుస్తూ...

### అధికారపార్టీ రాజీనామా చేయాలంటూ వింత ప్రతిపాదన



### తల పట్టుకుంటున్న తెలుగు తమ్ముళ్ళు

### తప్పించుకున్నాం అంటున్న ఆంధ్రా ప్రజలు

**ముఖ్యమంత్రి జగన్ ఆంధ్రాలో అమలు చేసిన రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా ఇప్పుడు రాష్ట్రంలో కొత్త ట్రెండ్ నడుస్తోంది.. అంతా రివర్స్.. రివర్స్.. రివర్స్.**

బహుశా ఈ రివర్స్ టెండరింగ్ విధానాన్ని అర్థం చేసుకోవడంలో చంద్రబాబు తప్పులో కాలేసినట్లుగా వుంది. జగన్ రివర్స్ టెండరింగ్ విధానానికి ప్రజామోదం విశేషంగా లభించింది కాబట్టి ఏదైనా రివర్స్‌లో మాట్లాడితే ప్రజలు తనని కూడా హర్షిస్తారని భావించినట్లుంది కాబోలు, ఆ ఉద్దేశ్యంతోనే తలతిక్క ప్రకటనలు చేసి కొడుకుకి తగ్గ బాబుగా ఆయన చరిత్ర కెక్కుతున్నాడు.

తన తమ్ముళ్ల లబ్ది కోసం ప్రారంభించిన అమరావతి కంపెనీని జగన్ మూసేయడంతో ఏం చెయ్యాలో దిక్కుతోచక జూమ్ జూమ్ అంటూ జూమ్‌లోకి వచ్చి దిక్కుమాలిన స్టేట్మెంట్లతో పరువు పోగొట్టుకుంటున్నాడు. ఇంతటి రాజకీయ చతురత, అనుభవం వున్న వ్యక్తి ఇప్పుడు పాలనా వికేంద్రీకరణ (మిగతా 3వ పేజీలో)

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెప్పిన సంజీవయ్య



సూళ్ళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కలసి నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చక్రధర్‌బాబుకు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు చెప్పారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 1న ఆయన కలెక్టర్‌ను కలిసి సూళ్ళూరుపేట నియోజకవర్గ సమస్యలను కూడా చర్చించారు. నియోజకవర్గంలో కరోనా నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి ఇద్దరూ మాట్లాడుకున్నారు.

# చంద్రపడియ పేలుడులో మరో కార్మికుని మృతి

- మృతుని కుటుంబానికి 35 లక్షలు సాయం
- ప్రమాద ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన త్రిసభ్య కమిటీ

వింజమూరు మండలంలోని చంద్రపడియ గ్రామంలో ఉన్న ఫార్మా కర్మాగారంలో ఇటీవల జరిగిన పేలుడు ప్రమాదంలో గాయపడి చెన్నైలో చికిత్స పొందుతున్న మరో కార్మికుడు రజనీకుమార్(25) ఈనెల 3వతేది రాత్రి మృతిచెందాడు. రజనీకుమార్ స్వస్థలమైన ఏఎస్‌పేట మండలం పెద్దబ్బీపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయన కుటుంబానికి ఈనెల5న 35లక్షల రూపాయల సహాయం అందించిది. అంతేకాక ఆ కుటుంబానికి 3సెంట్లు ఇంటిస్థలాన్ని కూడా అందజేశారు. బుధవారం(25వతేది) నాడు ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఆత్మకూరు ఆర్డీఓ పి.ఉమాదేవి, ఏఎస్‌పేట తహాశీల్దార్ లక్ష్మీనరసింహులు, ఎస్‌ఐ గోపాల్, ఫ్యాక్టరీ ప్రతినిధులు దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు. ఈ ప్రమాదంలో తొలుత ఆత్మకూరుకు చెందిన హఫీజ్ అనే కార్మికుడు మృతి చెందగా, రజనీకుమార్ మరణంతో మృతుల సంఖ్య రెండుకు చేరింది.

### ప్రమాద కారణాలపై త్వరలో నివేదిక :

చంద్రపడియ ఫ్యాక్టరీలో గత నెల 29న జరిగిన ప్రమాదఘటనపై త్రిసభ్య కమిటీ దర్యాప్తు ప్రారంభమైంది. ఈ కమిటీ త్వరలోనే తన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనుంది. త్రిసభ్య కమిటీలో జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ఇన్స్‌పెక్టర్ శివశంకర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఏ.ఇ ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఫ్యాక్టరీలోని అన్ని యంత్రాలను పరిశీలించి వాటిని అధ్యయనం చేసి ఉత్పత్తి సామర్థ్యం తదితర విషయాలన్నిటిపై నివేదికను రూపొందించే పని ప్రారంభించారు. మరోవైపు ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణను తొలిరోజు నుంచే ప్రారంభించారు. జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఆదేశాలతో కలిగిరి సిఐ శ్రీనివాసరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇంకోవైపు, కాలుష్యం వెదజల్లుతూ ప్రమాదకరంగా మారిన ఈ ఫ్యాక్టరీని మూసేయాలంటూ గ్రామస్తులు తీవ్ర ఆందోళన చేస్తున్నారు.

## ఉన్నత విద్యకు సమున్నత స్థానం కల్పించాలి

**· అధికారులతో సిఎం జగన్ సమీక్ష**

రాష్ట్రంలో ఉన్నత విద్యకు ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులకు మరింత ప్రయోజనం కలిగేవిధంగా సమున్నతమైన స్థానం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షిస్తూ... గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌ను 90 శాతానికి తీసుకురావాలన్నారు. మూడేళ్లు, నాలుగేళ్ళ డిగ్రీ కోర్సుల్లో 10 నెలలపాటు అప్రెంటిస్‌షిప్, ఆపైమరో ఏడాదిపాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పించే కోర్సుల బోధన, ఇవి నేర్చుకుంటే ఆనర్స్ డిగ్రీ ఇవ్వాలన్నారు. యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అక్టోబర్ 15 నుంచి కళాశాలలను తెరవాలన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజయనగరం, ప్రకాశం జిల్లాల్లో యూనివర్శిటీల ఏర్పాటుకు ఆయన ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించారు.

## విద్యుత్‌శాఖకు సిఎం ప్రాధాన్యత

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి విద్యుత్‌శాఖకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, గత ఇరవై ఏళ్ళలో ఎన్నడూ లేనంతగా ఏడాది కాలంలోనే సుమారు రెండువేల కోట్ల రూపాయల వ్యయంతో విద్యుత్‌శాఖలో అభివృద్ధి పనులు చేపట్టారని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. నెల్లూరులోని కొండాయపాళెం వద్ద నిర్మించిన 33-11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఈనెల 3న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా విద్యుత్ సౌకర్యాలు పుష్కలంగా ఉండేందుకు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోందన్నారు. కోవిడ్ వైరస్ విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో కూడా ఆసుపత్రులకు, కోవిడ్ కేర్ సెంటర్లకు, ఇళ్ళకు 24 గంటలూ విద్యుత్‌ను అందిస్తూ విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఎంతో శ్రమిస్తున్నారని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కొండాయపాళెంలో విద్యుత్ అంతరాయాలు తగ్గించేందుకు 2కోట్లా 70లక్షలతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఇ విజయకుమార్‌రెడ్డి, వైకాపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనాతో.. జిల్లా కకావికలం

**- 11,224కు బాధితుల సంఖ్య**
**- 151 మంది కన్నుమూత**

కరోనా జిల్లాను కకావికలం చేస్తోంది. ఈ మాయదారి వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య ఈనెల 6వ తేది గురువారం నాటికి 11,224కు చేరింది. ఈ వ్యాధితో మరణించిన వారి సంఖ్య 151కి చేరింది. వీరిలో కొంత మందిని ఐసొలేషన్‌లో ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. మరికొంతమందిని నగరంలోని నారాయణ, పెద్దాసుపత్రి, నెల్లూరు ఆసుపత్రి, హరిత ఏపి టూరిజం హోటల్‌లో చికిత్సలు చేస్తున్నారు. కరోనా విజృంభిస్తుండడంతో జిల్లా ఉన్నతాధికారులు కోవిడ్ వైరస్‌కు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి వాటిని కంటైన్మెంట్ జోన్‌లుగా ఏర్పాటుచేసి కరోనా నియంత్రణకు భారీ ఎత్తున కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. కరోనా నుంచి కోలుకున్న 5,453 మందిని వైద్యులు దశలవారీగా డిశ్చార్జి చేశారు. 5771 మంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. కరోనా వ్యాధి నియంత్రణకు ప్రజలందరూ తగు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని, మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటించాలని, కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం సూచిస్తున్న నిబంధనలన్నీ తప్పనిసరిగా పాటించాలని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నారు.

## రవిచంద్రవి మతిలేని మాటలు

- ఉనికి కాపాడుకునేందుకే బీద విమర్శలు
- వైకాపా నాయకుడు రూప్ ధ్వజం




గత ఎన్నికల్లో జిల్లాలో తెలుగుదేశం పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, జిల్లా అధ్యక్ష పదవి కోసం బీద రవిచంద్ర తన ఉనికిని కాపాడుకోవడానికే వైయస్సార్సీపిపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని, బీద విమర్శలు అర్ధరహితమని వైయస్సార్సీపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తాడు.

ఈనెల 5న ఆయన నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీద రవిచంద్ర విమర్శలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నాడు. అమరావతి రాజధాని కావాలనుకునేవాళ్ళు టిడిపి ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఎన్నికలకు వెళ్ళాలని, ఆ ధైర్యం మీకుందా అని ఆయన బీదకు సవాల్ విసిరాడు. బీద రవిచంద్ర ఆధ్వర్యంలో గత ఎన్నికల్లో జిల్లాలో టిడిపి అడ్రస్ గల్లంతైపోయిందని అన్నాడు. కొండను ఢీకొట్టి గెలిచిన వ్యక్తి మంత్రి అనిల్ అని, మంత్రిని రాజీనామా చేయాలనడం బీద అవివేకమని అన్నారు. మతిలేకుండా మాట్లాడడం మంచిది కాదన్నాడు. మూడు రాజధానులతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, ఇకనైనా బీద చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికాడు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు కొణిదల సుధీర్, ఎం.డి ఖలీల్ అహ్మద్, ఓబిలి రవిచంద్ర, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుట్కాల పుట్ట.. కావలి

- 10.65 లక్షల విలువైన సరుకు పట్టివేత
- ఆరుగురు నిందితుల అరెస్ట్

కావలి ప్రాంతం గుట్కాల పుట్టగా తయారవుతోంది. పోలీసులు తీగ లాగేకొద్దీ డొంకంతా కదులుతూనే ఉంది. ఇటీవలే ఈ ప్రాంతంలో పలువురు నిషేధిత గుట్కాలను విక్రయించడానికి పెద్దమొత్తంలో వాటిని నిల్వ ఉంచుకోవడాన్ని పోలీసులు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. తాజాగా మరో ఆరుగురు నిందితులు పోలీసులకు దొరికిపోయారు. ఈ విషయమై ఈనెల 3న కావలి డిఎస్పీ ప్రసాద్ విలేకరులకు ఆ వివరాలు చెప్పాడు. కావలి నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా గుట్కాలు సరఫరా చేస్తున్న ఆరుగురిని కావలి 1వ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారని, వారి నుంచి 10 లక్షలా 65వేల రూపాయల విలువైన 16 బస్తాల గుట్కా ప్యాకెట్లతో పాటు 1620 రూపాయల విలువగల 9 మద్యం సీసాలను, ఒక వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపాడు. నిందితులైన కంచర్ల నరేంద్ర, మొగిలి శామ్యూల్, లింగంగుంట సాగర్, శెట్టిపల్లి మల్లికార్జున్, మన్నేపల్లి శ్రీనివాసులు, ధన్యాసి శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నామని, ఈ నిందితులంతా కావలి, బోగోలు మండలాలకు చెందినవారని తెలిపాడు.

## కరోనాతో అటవీ అధికారి కన్నుమూత

చేజర్ల మండలంలోని తూర్పుకంభంపాడు పరిధిలోని ఫారెస్ట్ బీట్ అధికారి పి.సనత్ కరోనాతో నెల్లూరులోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 2న కన్నుమూశారు. శనివారం రోజున ఆయన డయాలసిస్ కోసం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళగా అక్కడ నిర్వహించిన కోవిడ్ పరీక్షలో పాజిటివ్‌గా తేలింది. అనంతరం నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చేరి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు అధికారవర్గాలు తెలిపాయి. సనత్ మృతితో అటవీశాఖ వర్గాలు ఆవేదనకు గురయ్యాయి.

## బిజెపి నాయకుల ఆనందోత్సాహాలు



అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టడం దేశ చరిత్రలోనే ఒక అపూర్వమైన ఘట్టమని అంటూ ఈనెల 5న నెల్లూరులోని బిజెపి నేతలు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. బిజెపి యువ మోర్చా నాయకుడు యశ్వంత్ సింగ్ నగరంలోని పాత మునిసిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న రామాలయంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 108 టెంకాయలు కొట్టి అందరికీ మిఠాయిలు అందజేశారు. అదేవిధంగా ట్రంకురోడ్డులో ఉన్న లస్సీ సెంటర్‌లో బిజెపి నాయకులు మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు మెంటా రామ్మోహన్, మిడతల రమేష్, రవి, రాంబాబు, రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయుల కల సాకారం.. రామయ్య గుడికి శ్రీకారం



**అయోధ్యలో శ్రీరామ ధామానికి అత్యంత భక్తిశ్రద్ధలతో భూమిపూజ జరిగింది. రామాలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోడీ శ్రీకారం చుట్టడంతో దేశంలో ఆధ్మాత్మికత వెల్లువెత్తింది. ఇది దేశంలో ఓ అద్భుతఘట్టం. దేశ చరిత్రలోనే ఇది ఓ సువర్ణాధ్యాయం. దీంతో రామజన్మభూమి అయోధ్య... రామనామంతో పులకించింది. జైశ్రీరామ్, శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ భక్తులు చేసిన రామనామ స్మరణలతో మార్మోగింది. కాషాయజెండాలు రెపరెపలాడాయి. పవిత్ర నదుల నుంచి తెచ్చిన జలాలతో, 'శ్రీరామ' పేరుతో భక్తులు తెచ్చిన ఇటుకలు, పవిత్ర క్షేత్రాల నుంచి తెచ్చిన మట్టి, నీరు భూమిపూజలో భాగమయ్యాయి. లక్షలాది దీపాలతో, రామ జ్యోతులతో అయోధ్య కళకళలాడింది. గుడిగంటల గణగణలతో, శంఖారావాలతో దేశమంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఎంతో పవిత్రమైన రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా తపాలాశాఖ ప్రత్యేకంగా రూపొందించిన తపాలాబిళ్ళను ప్రధాని మోడీ విడుదల చేశారు కూడా. కరోనా నేపథ్యంలో భూమిపూజలో సైతం మాస్కుని ధరించి ప్రధాని ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.**

అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ప్రధాని ఈనెల 5న బుధవారం మధ్యాహ్నం 12 గంటలా 44 నిమిషాలకు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఈ పవిత్రమైన పుణ్యకార్యమంతా ప్రధానంగా ప్రధాని చేతుల మీదుగానే జరగడం విశేషం. ఈ భూమిపూజ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్నంతా దీపకాంతులతో దేదీప్య మానం చేశారు. ఒక్క అయోధ్యలోనే 3.51 లక్షల దీపాలను వెలిగించి రామనామంతో తరించారు. శ్రీరాముడి పాదాల చెంతనే నిర్మాణ శంకుస్థాపనకు నక్షత్రాల ఆకారంలో ఉన్న అయిదు వెండి ఇటుకలను ఉపయోగించారు. ఆలయప్రాంగణంలో ప్రధాని దేవతా వృక్షమైన పారిజాతం మొక్కను నాటారు. రామ్‌లల్లాలోకి వెళ్ళే ముందు ఎంతో భక్తితో సాష్టాంగ నమస్కారం చేసి లోపలకి వెళ్ళారు. భూమిపూజ అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ 'జై శ్రీరాం' అంటూ రామ నామస్మరణ చేస్తూ ప్రసంగం ప్రారంభించారు.

## 300 కోట్ల వ్యయంతో సుందరమైన రామ మందిరం :

సుమారు 300 కోట్ల రూపాయల వ్యయంతో అత్యద్భుతంగా అయోధ్యలో రామమందిరం నిర్మించనున్నారు. రామ జన్మభూమి ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన బిజెపి సీనియర్ నేత లాల్‌కృష్ణ అద్వాని, మరో అగ్రనేత మురళీమనోహర్ జోషి వంటి ప్రముఖులు భూమిపూజకు రాలేకపోయినా టీవీల్లో ఈ కార్యక్రమాన్ని తిలకించి ఆనందపరవశులయ్యారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, యుపి ముఖ్యమంత్రి ఆదిత్యానాథ్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ట్రస్టు అధ్యక్షుడు నృత్యగోపాలన్, మాజీ సిఎం ఉమాభారతి, యోగా గురువు రామ్‌దేవ్ బాబాతో పాటు పలువురు పీఠాధిపతులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## శతాబ్దాల నిరీక్షణ ఫలించింది

అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం శతాబ్దాల తరబడి నిరీక్షణ ఫలించిందని, ఈ మందిరం భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని, అత్యంత పవిత్రమైన ఈ రామమందిర నిర్మాణానికి భూమిపూజ చేయడం ఒక మహద్భాగ్యమని, ఇది యావత్ ప్రపంచానికీ శుభ పరిణామమని ప్రధాని ఈ సందర్భంగా తన ప్రసంగంలో అన్నారు. ధర్మబద్ధమైన రామమందిర నిర్మాణం ప్రజలందరి సహకారంతో ప్రారంభమైందన్నారు. 'ఈరోజు భారత్ మొత్తం భావుకతతో నిండిపోయింది. శతాబ్దాల ఎదురుచూపులు సమాప్తమవుతున్నాయి. మన జీవితం పావనమవుతోంది. ఒక చిన్న గుడారంలో ఉన్న రాముడి గుడి ఇకపై అత్యద్భుతమైన రామమందిరంగా మారబోతోంది. రామ జన్మభూమి విముక్తమవుతోంది"..అంటూ ఉద్వేగంగా అన్నారు. రాముడు భారతీయ సంస్కృతికి ప్రతీక అని, మర్యాదా పురుషోత్తముడని అభివర్ణిస్తూ శ్రీరాముని ధీరత్వాన్ని, త్యాగగుణాలను, ధర్మనిరతిని ప్రధాని ఈ సందర్భంగా ఎలాంటి తటపటాయింపు లేకుండా సుదీర్ఘంగా వివరించడం అయోధ్యవాసులనే కాక, మొత్తం భారతీయులందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

## శ్రీరాముడే ఆదర్శం...

శ్రీరాముడి ఆదర్శాల బాటలో భారత్ పయనిస్తోందని, సవాళ్ళను ఎలా ఎదుర్కోవాలో, జ్ఞానాన్ని ఎలా పొందాలో, ఎలా సాధించాలో శ్రీరాముడు మనకు నేర్పాడని, ప్రేమ-గౌరవభావం-సోదరభావం అనే ఇటుకలతో రామమందిరం నిర్మాణం కావాలని ఆకాంక్షించారు. భగవంతునిపై విశ్వాసం ఉంచినప్పుడు మానవత్వం పురోగమిస్తుందన్నారు. అందరి మనోభావాలను గౌరవించాలని, అందరూ కలసి మెలసి ఉండాలని, ఒకరినొకరు విశ్వసించాలని, మనదేశం స్వావలంబన కలిగిన దేశంగా అభివృద్ధి కావాలని కోరుకుంటూ ఈ కరోనా కాలంలో నా దేశాన్ని ఆరోగ్యంగా, సంతోషంగా ఉంచాలని ఆ శ్రీరామ చంద్రుడిని ప్రార్థిస్తున్నానంటూ 'శ్రీరామ చంద్ర ప్రభువుకీ జై'!..అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. అత్యంత దైవభక్తితో, దేశభక్తితో కూడిన ప్రధాని మోడీ ప్రసంగాన్ని భారతప్రజలే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎంతో ఆసక్తితో ప్రసార మాధ్యమాల్లో తిలకించి పులకించిపోయారు. ఎంతో శాంతియుతంగా, ప్రజా స్వామ్య బద్ధంగా జరిగిన ఈ భూమిపూజ కార్యక్రమం దేశప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది.



అయోధ్య రామయ్య గుడికి శంకుస్థాపన మహోత్సవం జరిగినంత సేపు ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్య, ఆయన సతీమణి శ్రీమతి ఉషమ్మలు శ్రీరామ నామస్మరణ చేశారు. అక్కడ కార్యక్రమం జరిగినంతసేపు కూడా వీరు పారాయణాన్ని కొనసాగించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రామమందిరం నిర్మాణానికి 5లక్షల రూపాయలు, పి.ఎం కేర్‌కి 5లక్షల రూపాయల విరాళాన్ని శ్రీమతి ఉషమ్మ ప్రకటించారు. తమ కుటుంబసభ్యుల సహకారంతో ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోవిడ్ నివారణ కోసం పరిస్థితులు చక్కబడే వరకు తన వేతనం నుండి 30శాతం వెంకయ్యనాయుడు విరాళంగా ప్రకటించిన విషయం మనకు తెలిసిందే!

## సకల జగద్రక్షకుడు.. శ్రీరాముడు

సకల జగద్రక్షకుడు, మానవాళికి మార్గదర్శకుడు, ఆదర్శప్రాయుడు, ధర్మమూర్తి అయిన శ్రీరామచంద్రుడు మానవాళికి అనాదిగా మార్గదర్శకునిగా, ఆరాధనీయునిగా ఉంటూ తరతరాలుగా యుగయుగాలుగా అందరి పూజలందుకుంటున్నాడు. పురాతన భారతావనికి స్ఫూర్తిగా నిలచిన శ్రీరాముడు ఆ తర్వాతి కాలాల్లోనూ అందరి పూజలందుకుంటూనే ఉన్నాడు. ఎందరో ప్రముఖ కవులు, భక్తశిఖామణులు సీతారాముల దివ్యచరితను రచించి ధన్యులయ్యారు. రామాయణాన్ని పారాయణం చేయడం ఒక పుణ్యకార్యంగా భావిస్తూ ఎందరో భక్తులు తరించారు. మన జాతి పిత మహాత్మాగాంధీజీ కూడా రామ రాజ్యం కోసమే కలలు కన్నారు. సత్యం, అహింస, దయ, కరుణ వంటివన్నీ శ్రీరాముడు మనకు నేర్పించినవే.

ప్రపంచంలోని అనేక దేశాలవారు కూడా శ్రీరాముని భగవంతునిగా పూజిస్తున్నారు. ఈ ఆధునిక కాలంలోనూ ఒక్క భారత్‌లోనే కాక శ్రీలంక, థాయిలాండ్, కంబోడియా, మలేషియా, ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా వంటి అనేక దేశాల్లో కూడా శ్రీరాముడిని ఆరాధిస్తూనే ఉన్నారు. అలాంటి రాముడు జన్మించిన అయోధ్యలో ప్రపంచమే ఆశ్చర్యపోయే రీతిలో అత్యంత అద్భుతంగా శ్రీరామునికి మందిరం నిర్మించుకోవాలన్న భారతీయుల శతాబ్దాల నాటి స్వప్నం నేటికి ఫలించడంతో దేశ ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

# విఎస్‌యులో 'సింహపురి విశిష్ట ఉపన్యాస సీరీస్' ప్రారంభం

నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీలో ఇటీవల 'సింహపురి విశిష్ట ఉపన్యాస సీరీస్'ను ప్రారంభించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆన్‌లైన్ వెబ్‌నార్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యత, సమానత్వం, పరిపాలనా సామర్థ్యం వంటి నిర్మాణాత్మక మార్పులను విద్యావ్యవస్థలో తీసుకువచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. విలువలతో కూడిన విద్యను అందుకోవడానికి పేదరికం అడ్డుకాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం విద్యావిధానంలో అనేక మార్పులు తెస్తోందన్నారు. కోవిడ్ వైరస్ వల్ల బోధన, అభ్యాస ప్రక్రియల్లో వచ్చిన సమస్యలను అధిగమించేందుకు తగు సాంకేతికపరిజ్ఞానాన్ని అవలంభించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన నాడు-నేడు, జగనన్న విద్యాదీవెన పథకాల గురించి వివరించారు. సింహపురి విశిష్ట ఉపన్యాస్ సీరీస్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా నెల్లూరులో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు బోదన బోధనేతర సిబ్బందికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వివిధరంగాల్లో ప్రఖ్యాతిగాంచిన ప్రముఖుల ఉపన్యాసాలను అందించడం ఒక మంచి పరిణామమని విఎస్‌యు వీసీని, సిబ్బందిని మంత్రి ఈ సందర్భంగా కొనియాడారు. విఎస్‌యు వీసీ ఆర్.సుదర్శనరావు,రెక్టార్ ఎం. చంద్రయ్య, రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, డీన్ విజయ్ ఆనంద్‌కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




# బాబు 'రివర్స్' ట్రెండ్

(మొదటి పేజీ తరువాయి)

విషయంలో స్పష్టత లేకుండా, తాను అనుసరించాల్సిన విధానం పట్ల కూడా వ్యూహం లేకుండా, జగన్మోహన్‌రెడ్డిని దమ్ముంటే రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికలకు వెళ్ళమని, ప్రజలు మళ్ళీ జగన్‌కే మద్దతు పలికితే, అప్పుడు తాను గెలిచిన సీట్లు కూడా జగన్ ఖాతాలోనే వేసేస్తానని బాబు చెప్పడం, జగన్‌కి చంద్రబాబు బంపర్ ఆఫర్ అని బాబు మీడియా పతాక శీర్షికలో ప్రచురించడం చూస్తుంటే, బాబు & కో మానసిక పరిస్థితి ఏ స్థాయిలోవుందో మనం అర్థం చేసుకోవచ్చు.

అసెంబ్లీ సమావేశాలలో పాలక పక్షం తీసుకునే నిర్ణయాలు ప్రతిపక్షానికి నచ్చకపోతే, అందుకు నిరసనగా ప్రతిపక్షం వాకౌట్ చేస్తుంది, అంతేకానీ అధికారపక్షాన్ని వాకౌట్ చెయ్యమని అడగదు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలలో లోపాలున్నా, ప్రభుత్వ విధానాలతో ప్రజలకు నష్టం జరుగుతున్నా ప్రతిపక్షం దానిని వ్యతిరేకించి బందులు, ధర్నాలు చెయ్యడమో లేక తమ పదవులకు రాజీనామా చేసి నిరసన తెలుపడమో జరుగుతుంది, అంతేగాని అధికార పక్షాన్నే ధర్నాలు, నిరసనలు చెయ్యమనో లేక రాజీనామా చెయ్యమనో చెప్పరు. కానీ బాబు ఇప్పుడు రివర్స్ విధానాన్ని అమలు చెయ్యాలని చూస్తున్నట్లుంది. జగన్ ప్రభుత్వం పాలనా వికేంద్రీకరణ దిశగా తాము తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా మీరే రాజీనామా చెయ్యాలని బాబు రివర్స్‌లో జగన్‌నే డిమాండ్ చేస్తున్నాడు.

చంద్రబాబు వింత, విచిత్ర వైఖరి చూసి ఇలాంటి నాయకుడి నాయకత్వంలో తామెలా పనిచెయ్యాలిరా దేవుడా..! అని తెలుగు తమ్ముళ్లు కుళ్ళి, కుమిలిపోతుంటే, 2019 ఎన్నికలలో మతిస్థిమితం లేని బాబుని ఇంటికి పంపించి మంచిపని చేశామని ఆంధ్రా ప్రజలు ఖుషీ ఖుషీగా వున్నారని రాజకీయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

## 'ప్రభా'తం

'రామో విగ్రహవాన్ ధర్మః'.. అంటుంది వాల్మీకి రామాయణం. రామాయణంలో శ్రీరాముడిని ధర్మానికి ప్రతిరూపంగా అభివర్ణించారు మహాకవి వాల్మీకి. రాముడు సకల సుగుణాభిరాముడు. అసామాన్య ధైర్యసాహసాలే కాకుండా త్యాగం, దయ, కరుణ వంటివి ఆయన సుగుణాలు. మహావిష్ణువుకు ప్రతిరూపమైన శ్రీరామచంద్రుడు.. త్రేతాయుగంలో లోకకల్యాణం కోసం మానవరూపంలో అవతరించాడు. రాముడు దేవుడే అయినా.. సాధారణ మానవునిగానే కష్టాలను అనుభవించాడు. అన్ని కష్టాలనూ ధైర్యంగానే ఎదుర్కొన్నాడు. ఏనాడూ ధర్మాన్ని వీడలేదు. రాజ్యాన్ని సకల జనరంజకంగా పాలించాడు. రామరాజ్యంలో ప్రజలకు ఎలాంటి కష్టాలుండవని నిరూపించాడు. అన్నిటికీమించి రాముడు.. పూజనీయుడు. మర్యాదా పురుషోత్తముడు. శాంతిప్రియుడు.. త్యాగమయుడు. అందుకే భారతావనికి శ్రీరాముడు ఆదర్శనీయుడయ్యాడు. అందరికీ ఆరాధనీయుడయ్యాడు. భారతీయ సంస్కృతికి ప్రతిరూపమయ్యాడు. ప్రపంచవ్యాప్తంగా సకల మానవాళికీ మార్గదర్శకుడయ్యాడు. అంతటి విశిష్టమైన శ్రీరామచంద్రుని జన్మభూమిలో రామమందిర నిర్మాణానికి ఈనెల 5న అయోధ్యలో భారత ప్రధాని మోడీ చేతుల మీదుగా భూమిపూజ జరగడం భారత దేశ చరిత్రలోనే అద్భుతం.. అపూర్వం!.. భారతీయు లందరికే కాదు, ప్రపంచ మానవాళికే గర్వకారణం.

మనదేశంలో రామాలయం లేని ప్రాంతం ఉండదు. ప్రతి ఊరూ..ప్రతి వాడలో రామమందిరం తప్పకుండా ఉంటుంది. రాముడు గుడిలోనే కాదు.. ప్రతి మదిలోనూ దేవుడు. ఒక్క త్రేతాయుగంలోనే కాదు... నేటి కలియుగంలోనే కాదు.. ఎన్ని యుగాలకైనా ఆయనే దేవుడుగా కీర్తించబడుతున్నాడు. ప్రత్యేకించి రాముడు భారతీయులకు ఆరాధ్యదైవంగా అందరి పూజలందుకుంటున్నాడు. అందుకే మన దేశంలో రామాయణం, రామకథ, సీతారాముల చరిత్ర తెలియనివారు ఉండరు. జాతిపిత మహాత్మా గాంధీజీ కూడా రామరాజ్యాన్నే కోరుకున్నాడు. అందుకోసమే తపించాడు. రాముని సుపరిపాలన, సత్యవాక్పరిపాలన, పితృవాక్పరిపాలన వంటి సుగుణాలు.. ఏకపత్నీవ్రతునిగా, కర్తవ్య నిష్ఠాగరిష్టునిగా.. అన్నిటికీ మించి ధర్మమూర్తిగా మూర్తీభవించిన శ్రీరామచంద్రుడు సకల మానవాళికి ఆదర్శంగా నిలుస్తాడు. అందుకే రాముడికీ..రామాయణానికి అంత విశిష్టత..అంత పవిత్రత! కులాలు మతాలు జాతులు ప్రాంతాలకు అతీతంగా అందరికీ ఎంతో స్ఫూర్తినిచ్చేదే రామకథ. అందువల్లనే రామకథ విశ్వవ్యాప్తమైంది. అనేక దేశాల్లో, అనేక భాషల్లో రామాయణం అనువాదాలు, రచనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. ఒక్క మనదేశంలోనే కాదు.. 'రామాయణం' ప్రపంచవ్యాప్తమైంది కూడా.

అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరగాలంటూ ఎన్నో దశాబ్దాలుగా సాగుతున్న పోరాటం ఇన్నాళ్ళకు.. ఇన్నేళ్ళకు ఫలించింది. రామజన్మభూమి-బాబ్రీమసీదు వివాదం ఏళ్ళ తరబడి సాగిన విషయం అందరికీ తెలిసిందే. బాబ్రీ మసీదు ఉన్న ప్రాంతం రామజన్మభూమి అని, ఆ స్థానంలో రామమందిరం నిర్మించాలని జనసంఘ్‌గా ఉన్నప్పటి నుంచి బిజెపి పోరాడుతూ వచ్చింది. ఏళ్ళ తరబడిగా ఉన్న ఈ క్లిష్టమైన సమస్యపై గత ఏడాది నవంబరు 9న సుప్రీంకోర్టు తుదితీర్పు ఇచ్చింది. 2.77 ఎకరాల వివాదాస్పద స్థలాన్ని రామమందిర నిర్మాణానికి అప్పగించాలని, ఒక ట్రస్టు ఆధ్వర్యంలో మందిర నిర్మాణం పనులు జరగాలని అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది. మసీదు నిర్మాణానికి అయోధ్యలోనే అయిదెకరాల స్థలం కేటాయించాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ తీర్పు చెప్పింది. దీంతో దేశంలో అత్యంత క్లిష్టమైన ఈ సమస్యకు తెరపడినట్లయింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ సమున్నతమైన తీర్పును అన్ని వర్గాలు సాదరంగా స్వాగతించాయి కూడా. ఎట్టకేలకు అయోధ్యలో సయోధ్యకు అంకురార్పణ జరిగినట్లయింది.

ఇప్పుడు రామమందిర నిర్మాణ శ్రీకారంతో భారతీయుల చిరకాల స్వప్నం సాకారమైంది. భారతావనిలో ఒక కొత్త అధ్యాయానికి.. సరికొత్త శకానికి ప్రారంభం జరిగినట్లయింది. రామాలయ నిర్మాణానికి ప్రధాని మోడీ ఎంతో భక్తిశ్రద్ధలతో భూమిపూజ చేసి కోట్లాది ప్రజల కల సాకారానికి శ్రీకారం చుట్టడంతో ఎల్లెడలా ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. మోడీ సుమారు 29 ఏళ్ళ క్రితం అయోధ్యను సందర్శించినప్పుడు.. మళ్ళీ ఇక్కడ రామాలయం నిర్మాణం పనులు ప్రారంభమైనప్పుడే వస్తానని చేసిన శపథం.. ఇప్పుడు నెరవేరినట్లయింది. ఇప్పుడు కూడా అదే నెల, అదే తేదీన రామాలయం నిర్మాణానికి భూమిపూజ చేయడం కూడా మరో అద్భుతం!.. ఇంతటి సుదీర్ఘ కాల నిరీక్షణ ఎంతైనా అపూర్వం!... రాముడు అందరివాడని.. రామాలయ నిర్మాణంతో భారత్‌లో నవశకం ఆరంభం అవుతుందని, దేశ సమైక్యతకు చిహ్నంగా నిలుస్తుందనీ చెప్పిన మోడీ మాట అక్షరసత్యమైంది. భూమిపూజ సందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. జైశ్రీరామ్ నామస్మరణలతో ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించడం, రామజన్మభూమి కోసం ప్రాణత్యాగం చేసినవారిని గుర్తుచేసుకోవడంతో పాటు శాంతి సామరస్యాలతో, సహనంతో ఉంటే ఎంతటి జటిలమైన సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని చెప్పడం ప్రతిఒక్కరినీ బాగా ఆకట్టుకుంది.

అయోధ్యలో ఎంతో అపూర్వమైన రామమందిర నిర్మాణ భూమిపూజా మహోత్సవాన్ని ఈనెల 5న దేశప్రజలంతా 'మరో శ్రీరామనవమి' అన్నట్లుగా సంతోషసంరంభాలతో ఒక పండుగలా జరుపుకున్నారంటే అతిశయోక్తి కాదు. కరోనా మూలంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళలోను, గుడుల్లో సామాజిక దూరం పాటిస్తూ అందరూ రామనామ స్మరణతో పులకించిపోయారు.

దేశంలో సమైక్యతాభావానికి, ఏనాటికీ చెరగని శాంతి సామరస్యాలకీ శ్రీరామరక్షగా.. దివ్యమైన భవ్యమైన అయోధ్య రామమందిరం మానవాళికంతటికీ ఆదర్శవంతంగా.. ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

# అపూర్వ రామాయణం



అయోధ్యలోని రామజన్మభూమిలో రామ మందిర నిర్మాణ శ్రీకారంతో భారతీయుల చిరకాల స్వప్నం నెరవేరినట్లయింది. భారతావనిలో ఒక సరికొత్త శకం ప్రారంభమైనట్లయింది. రామాలయ నిర్మాణానికి ప్రధాని మోడీ భూమిపూజ చేసి కోట్లాది భారతీయుల కల సాకారానికి శ్రీకారం చుట్టడం దేశచరిత్రలోనే అపూర్వం. దేశంలో సమైక్యతాభావానికి, శాంతి సామరస్యాలకీ శ్రీరామరక్షగా.. ఈ దివ్యమైన రామమందిరం మానవాళికంతటికీ ఆదర్శంగా నిలుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

---



## స్వర్ణశోభితంగా..
## చెంగాళ పరమేశ్వరీదేవి

ఆంధ్ర తమిళ భక్తుల ఆరాధ్యదైవమైన సూళ్ళూరుపేట చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి ఈనెల 2న ఎంతో విశిష్టమైన శ్రావణ మాసం.. ఆదివారాన్ని పురస్కరించుకుని విశేషమైన అలంకారం నిర్వహించారు. ఉదయం, సాయంత్రం నిర్వహించిన ఈ అద్వితీయమైన అలంకారాలతో అమ్మవారు స్వర్ణశోభితమై కన్నుల పండువగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు విశేషపూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించారు. ఈ వేడుకలకు భాస్కర్-శారద దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ ఇఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. కరోనా నేపథ్యంలో భక్తులు సామాజిక దూరం పాటిస్తూ అమ్మవారిని దర్శించుకుని తరించారు.

ఈ-మెయిల్ ప్రజావాణి roopagroup@yahoo.com

### "దూరమవుతున్న మదరాసు"
## పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది

గతవారం 'లాయర్'లో 'ఈనాటి బంధం ఏనాటిదో' అంటూ మద్రాస్ పట్టణంతో నెల్లూరోళ్లకు వున్న అనుబంధాన్ని చక్కగా వివరించారు. దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం మా అమ్మాయి పెళ్లి వస్తువుల కొనుగోళ్ల కోసం మా కుటుంబంతో సహా మద్రాసుకు వెళ్లి మీరు చెప్పిన యాండర్సన్ వీధిలో పెళ్లిపత్రికలు ఎంపిక చేసుకుని నేషనల్ లాడ్జిలో టోకెన్ తీసుకుని మధ్యాహ్నం భోజనం చేశాం. నేను గతంలో అదే లాడ్జిలో అనేకసార్లు భోంచేసినప్పటికి మా ఇంట్లోవాళ్ళకి అదొక కొత్త అనుభూతి. మదరాసీయులతో మన స్నేహం చాలా పురాతనమైనది. ఒకప్పుడు మనం ఉమ్మడి రాష్ట్రంగా ఉండేవాళ్ళం కాబట్టి తమిళనాడుతో ఆత్మీయ సంబంధాలు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుత పరిస్థితిని తల్చుకుంటే బాధేస్తుంది. అన్నీ సర్దుకుని ఈ కరోనా బారినుండి మనం కోలుకుని మళ్ళీ పూర్వ పరిస్థితులు రావాలని ప్రార్థిద్దాం.

**కె.ఓబులరెడ్డి, కావలి.**

# మీడియాని క్వారంటైన్ చెయ్యండి!

కరోనా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ మీ పత్రికలో ఒక వార్త చదివాను. చాలా సంతోషం. ఎవరో ఒకరో ఇద్దరో మీలాంటోళ్ళు తప్ప మిగిలిన మీడియా అంతా కరోనాని ప్రాణాంతక జబ్బులాగా ప్రచారం చేస్తూ సగం మందిని భయంతోనే చంపేస్తున్నారు. మొన్న సోమవారం నాడు ఒక ప్రముఖ దినపత్రికైతే 'హఠాత్తుగా ఆపద' అంటూ హెడ్డింగ్ పెట్టి ఎక్కడివారు అక్కడే కుప్పకూలి చచ్చిపోతున్నారు అంటూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేసే విధంగా మొదటి పేజీ వార్త వేశారు. ఇది మంచి సంప్రదాయం కాదు. ఒకవేళ ప్రమాదం ప్రాణాలు తీసేంత స్థాయిలో ఉన్నా కూడా పాఠకులని చైతన్యపరిచి తీసుకోవలసిన ముందు జాగ్రత్తలగురించి అవగాహన కల్పించాలి తప్ప ఇలా దడిపించడం అన్యాయం. కొన్ని మీడియా ఛానళ్లలో వస్తున్న వార్తలు చూస్తుంటే ఇక ఈ సృష్టే అంతమైపోతుందా అన్నంత ఆందోళన కలుగుతోంది. వాస్తవానికి భారతదేశంలో మరణాల సంఖ్య చాలా తక్కువగా ఉండడమే కాకుండా, జబ్బు తీవ్రత కూడా తక్కువే, ఎక్కువమంది అసలు ఆసుపత్రి ముఖం కూడా చూడకుండానే కోలుకుంటున్నారు. తమ చానళ్ళు, పేపర్ల పాపులారిటీ కోసం సంచలన వార్తలు చూపించాలనే తాపత్రయంలో ఇలా ప్రజలని భయపెట్టడం సబబు కాదు. ఇప్పుడు నా వయసు 80సంవత్సరాలు. ఇలాంటివి చదివినా, చూసినా నాలాంటి వయసు మీరినవారు గుండెపోటుతో చస్తారు. అసలు ఈ మీడియా ఛానళ్లని, పత్రికలని ఒక నెల రోజులపాటు క్వారంటైన్ చేసి ఐసోలేషన్‌లో ఉంచితే కరోనా శాంతిస్తుంది. ప్రజలు సంతోషంగా వుంటారు.

**పి.వెంకటరామిరెడ్డి, అల్లూరు.**

# పరిశ్రమలు రావాలి

ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గారు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న రాయితీలు, ఉచిత సహాయ కార్యక్రమాలు అన్నీ బాగానే వున్నాయి. ముఖ్యంగా విద్య, వైద్యం విషయంలో ఆయన అవలంభిస్తున్న విధానాలు చరిత్రాత్మకమైనవి, రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రాగానే కాకుండా సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా కూడా మనం చూడొచ్చు. పారిశ్రామిక అభివృద్ధిపై కూడా ప్రభుత్వం చొరవ చూపితే బాగుంటుంది. ఇటీవల పలువురు పారిశ్రామికవేత్తలతోను, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంతోనూ ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు తద్వారా పెట్టుబడులు రావాలంటే ఏం చెయ్యాలన్న దానిమీద చర్చించారు కూడా. ఈ విషయంలో ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఒక కమిటీని నియమించి, ఉత్పత్తి పరిశ్రమల ద్వారా రాష్ట్రంలో త్వరితగతిన పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకుంటే, అటు నిరుద్యోగ సమస్య తీరిపోవడంతో పాటుగా ఆర్థికపరంగా కూడా రాష్ట్రానికి మేలు జరుగుతుంది. సీయం గారూ! ఆలోచించండి.

**జి.అరుణకుమారి, గూడూరు.**


### 'లాయర్'
## వారం వారం అలరిస్తోంది

జులై 31వ తేదీ 'లాయర్' నూతన విశేషాలతో జనరంజకంగా ఉండి మమ్మల్ని ఎంతగానో అలరించింది. ఎన్నో కొత్త కొత్త విషయాలను పాఠకులకు చేరవేసింది. ముఖ్యంగా "మనకు దూరమైపోతున్న మదరాసు" వ్యాసం చాలా బాగుంది. సర్వాంగసుందరంగా ముస్తాబు చేసి వారం వారం నెల్లూరు వార్తలను మాకు చేరవేస్తున్నందుకు వందనాలు తెలుపుతున్నాను.

**దువ్వూరు జనార్దన్‌రెడ్డి, చికాగో, యు.ఎస్.ఏ**

## వరుణుడి కరుణతో..

# పులకిస్తున్న జలాశయాలు



- నిండా నీటితో అంతటా జలకళ
- సుదీర్ఘకాలం తర్వాత సోమశిల నిండా నీళ్ళు
- రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి

***వైయస్ పాలనలో వర్షాలకు కొదవ ఉండదు అనే మాట.. ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. 'వైయస్ అనగానే..వర్షాలు ఓ యస్' అంటున్నాయని రైతులు సంతోషంగా చెప్పుకుంటున్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చాక వానలు బాగా కురుస్తూ రాష్ట్రం సస్యశ్యామలం అవుతోంది. జిల్లాలోనూ వర్షాలకు కొదవ లేదు. వరుణుడి కరుణతో జిల్లాలో జలాశయాలు పులకిస్తున్నాయి. చెరువులు దొరువులు అన్నీ నిండిపోయి జలకళతో తొణికిసలాడుతున్నాయి. సాగునీళ్ళకు ఇబ్బంది లేకుండా ఉండడంతో ధాన్యం దిగుబడి కూడా రికార్డు స్థాయిలో వచ్చింది. ఈ కరోనా కష్టకాలంలో కూడా.. తాజాగా రెండోపంట దిగుబడి కూడా ఆశాజనకంగానే ఉండడం విశేషం.***

జిల్లాలో గతంలో వానలు లేక చెరువుల్లోకి నీళ్ళు రాక రైతులు ఎంతో ఇబ్బందులు పడేవారు. ఇప్పుడా గడ్డుకాలం పోయింది. కరోనా వైరస్ విజృంభిస్తున్నప్పటికీ జిల్లాలోని రైతాంగం ఎంతో పట్టుదలతో అధికదిగుబడులు సాధిస్తున్నారు. జిల్లాలో వర్షాలు పుష్కలంగా కురుస్తుండడంతో రైతులు రెండోపంటను కూడా సాగుచేసుకుని కోతలకు సిద్ధమయ్యారు. జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల జలాశయం చాలాకాలం తర్వాత ఇప్పుడు పూర్తిగా నిండడంతో పాటు, పైతట్టు ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో పొర్లిపోతుండడంతో 12 క్రస్ట్‌గేట్లు ఎత్తివేసి నీటిని బయటకు వదలడం కూడా జరిగింది. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం భారీ చర్యలు చేపట్టడంతో ఖరీఫ్ సీజన్‌లో 4.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరగిందంటే ధాన్యం దిగుబడి ఎంత పుష్కలంగా ఉందో ఊహించుకోవచ్చు.

ఈ రబీ సీజన్‌లో రెండవ పంటకు నీళ్ళు వదలడంతో జిల్లాలో ఒక్క వరిపంటే సుమారు 81వేల హెక్టార్లలో పండింది. దాదాపు 6 లక్షల మెట్రిక్ టన్నుల దాకా రెండో పంట దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ధాన్యానికి గిట్టుబాటు ధర ఇస్తూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారుల చర్యలు :**

జిల్లావ్యాప్తంగా 65 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు అవసరమైన గోతాలు వగైరాలన్నీ సిద్ధం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పిస్తూ ప్రభుత్వం ప్రకటించిన ధరతో అధికారులు ధాన్యాన్ని కొనుగోళ్ళు చేస్తున్నారు. మొదటి పంట ధాన్యానికి సంబంధించి జిల్లాలోని రైతులకు 747.48కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటిదాకా 733.90 కోట్లు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలో చెల్లించనున్నారు. కొన్ని చోట్ల ముందుగా వేసుకున్న రెండో పంట చేతికి రావడంతో ఆ ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు సమాయత్తమవుతుంటే, ఇదే అదనుగా మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆ రైతులు గిట్టుబాటు ధర లేక నష్టాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రెండోపంటకు సంబంధించిన ధాన్యాన్ని వెంటనే రైతుల నుంచి కొనుగోలు చేసి వారిని దళారుల బారి నుంచి కాపాడేందుకు అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

## అన్ని ప్రాంతాల అభివృద్ధికే

# సిఎం నిర్ణయం

**- ఎమ్మెల్యే కాకాణి**



రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికే సిఎం మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని, సిఎం నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నాడు. ఈనెల 1న ఆయన వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామంలోని వైయస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశాడు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్దిదారులకు పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ మూడు రాజధానులను ప్రజలందరూ ఆహ్వానిస్తుంటే టిడిపి నాయకులు మాత్రం అందుకు నిరసన వ్యక్తం చేస్తున్నారని, వాళ్ళు కొన్న భూముల ధరలు పడిపోతాయనే భయంతోనే వాళ్ళు దానిని వ్యతిరేకిస్తున్నారని ఆయన విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలు టిడిపి కార్యకర్తలకు మాత్రమే అందేవని, ఇప్పుడు వైకాపా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని అన్నాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో కొత్తగా 14055 మందికి పింఛన్లు మంజూరు చేశామని, దివ్యాంగులకు ప్రభుత్వం 3వేల రూపాయలను పింఛను అందిస్తోందని చెప్పాడు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సరళ, తహశీల్దార్ ప్రసాద్, వైకాపా నాయకులు కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మందల వెంకటశేషయ్య, నంబూరి రాజానాయుడు, అలగల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్లాస్మా దానం..

# కోవిడ్ బాధితులకు ప్రాణం



జిల్లాలో కరోనా వైరస్ సోకినవారిలో 99 శాతం మంది మెరుగైన చికిత్సలు పొంది కోలుకుంటున్నారని, ఒక్క శాతం మంది మాత్రమే ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పాడు. ఈనెల 3న ఆయన నెల్లూరులోని రెడ్‌క్రాస్ సొసైటీని సందర్శించి అక్కడ ఆధునిక వైద్య సదుపాయాలను పరిశీలించాడు. తొలిసారిగా ప్లాస్మా దాత నుండి ప్లాస్మాను సేకరించే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడాడు. కరోనా పాజిటివ్‌గా నమోదై చికిత్స పొంది సంపూర్ణమైన ఆరోగ్యంతో తిరగి వచ్చి కోవిడ్ చికిత్సలో కీలకమైన ప్లాస్మా దానానికి ముందుకు వచ్చిన డాక్టర్ చక్రవర్తిని కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించాడు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ కోవిడ్ బాధితులు త్వరితగతిన కోలుకునేందుకు ఆ వైరస్ నుంచి కోలుకున్నవారి ప్లాస్మా అవసరమని, ఒకరి నుంచి సేకరించిన ప్లాస్మాతో ఇద్దరు రోగులను కాపాడవచ్చని, ప్లాస్మా దానం చేసిన వారికి ప్రభుత్వం అయిదువేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందజేస్తున్నట్లు చెప్పాడు. జిల్లాలో కరోనా విస్తరిస్తున్నప్పటికీ కోలుకుంటున్నవారి శాతం ఎక్కువగా ఉందన్నాడు. అందువల్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ నెల్లూరుజిల్లా యూనిట్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.వి.ఎన్.చక్రధర్‌బాబును నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇటీవల కలసి శుభాకాంక్షలు చెప్తున్న ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి



## పంట బాగా పండింది..

# గిట్టుబాటు ధరే లేదు!

### చామగడ్డల రైతుల ఆవేదన



***అదేమి దురదృష్టమో కానీ ప్రతి ఏడాదీ ఏదో ఒక ఇబ్బంది జిల్లా రైతులను వెంటాడుతూనే ఉంది. ఎన్ని కష్టాలు పడి పంటలు సాగుచేసుకున్నా చివరికి పంటలు చేతికి అందివచ్చేసరికి ఏ విపత్తో.. ఉపద్రవమో వచ్చి అన్నదాతలకు కన్నీరే మిగిలిస్తోంది. ఈసారి చామగడ్డల రైతులు కూడా హటాత్తుగా వచ్చిపడిన కరోనా దెబ్బకు విలవిల్లాడుతున్నారు. చామగడ్డలు విరివిగా పండాయి కానీ.. గిట్టుబాటు ధర లేదని వారు ఆవేదన చెందుతున్నారు.***

జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం, కావలి రూరల్ మండలం తదితర ప్రాంతాల్లో చామగడ్డల సాగు బాగా సాగుతుంటుంది. ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా రైతులు ఆ పంటను సాగుచేసుకున్నారు. బుచ్చి సమీపంలోని దామరమడుగు, కాగులపాడు, చెల్లాయిపాలెం, కావలి చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాల్లో రైతులు చామగడ్డల సాగుమీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఎకరాకు సుమారు 70 వేల దాకా సాగుకు ఖర్చులవుతాయి. ఇంత పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి కష్టపడి వాటిని పండించుకున్న అనేకమంది రైతులు గతంలోకంటే ఈసారి బాగానే పంట పండింది అనుకున్నారు. కానీ, కరోనా దెబ్బతో రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కడి పంట అక్కడే నిలిచిపోయింది.

**కొనేవాళ్ళ కోసం ఎదురుచూపులు :**

చేతికందివచ్చిన చామగడ్డలన్నీ రోడ్ల పక్కన ఆరబెట్టుకుంటూ వాటిని ఎవరు కొంటారా అని ఆశతో ఎదురుచూపులు చూస్తున్నారు. దుకాణాలకు అమ్ముకుందామంటే మరీ తక్కువకు బేరమాడుతున్నారని, ఇదే సందని దళారులు కూడా మరింతగా తక్కువ ధరకు అడుగుతున్నారని, వంద కిలోలు అమ్మినా వెయ్యి రూపాయలు కూడా రావడం లేదని వారు చెప్తున్నారు. అప్పోసప్పో చేసి పంటలు పండించుకున్నా ధర లేకపోతే బతుకుజీవనం ఎలాగని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ దుస్థితిలో తమకు నష్టాలు తప్పడం లేదని రైతులు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్న విధంగా చామగడ్డలకు కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తే కొంతకు కొంతైనా ప్రయోజనం ఉంటుందని వారు ఆవేదనతో అభ్యర్థిస్తున్నారు. రైతులు దళారుల బారిన పడకుండా, ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా పంటలను కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. చామగడ్డలంటే వంటకాల్లో బాగా రుచి ఉండి, ఎందరికో ప్రియమైనదైనా.. వాటి సాగుకు, వాటిని అమ్ముకోవడానికి రైతులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి అభ్యర్థనలను పరిశీలించి జిల్లాలో చామగడ్డల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కరోనా నివారణకు

## 25 లక్షలు విరాళమిచ్చిన కృష్ణపట్నం పోర్టు



కరోనా నియంత్రణకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలకు కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం పాతిక లక్షల రూపాయలను విరాళంగా అందించింది. ఆ విరాళం చెక్కును పోర్టు పిఆర్‌ఓ వేణుగోపాల్ ఈనెల 1న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు అందజేశారు.

## 'స్పందన' అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**- జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్**



రెవెన్యూ సర్వీసులకు సంబంధించి 'స్పందన' కార్యక్రమం కింద వచ్చే అర్జీలను అధికారులు వెంటనే పరిశీలించి నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. వినోద్‌కుమార్ తహశీల్దార్లను ఆదేశించాడు. ఈనెల 3న ఆయన జిల్లాలోని గ్రామ సచివాలయాల పరిధిలో అమలవుతున్న 'స్పందన' కార్యక్రమంలో రేషన్‌కార్డుల్లో పేర్లు మార్పులు చేర్పులు, తొలగింపులు, పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి ఆధార్ సీడింగ్, టైటిల్‌డీడ్‌ల మ్యుటేషన్ ప్రక్రియ, ఈ-పాస్ పుస్తకాల రీప్లేస్‌మెంట్, ఆదాయ ధృవీకరణ పత్రాల మంజూరు, కుటుంబసభ్యుల సర్టిఫికెట్ల మంజూరు తదితర విషయాలపై ప్రజల వద్ద నుంచి వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నాడు.

### ఆగస్టు 15 దాకా..రేషన్ పంపిణీ

ఆగస్టు 4 నుంచి 15వ తేది దాకా లబ్ధిదారులకు రేషన్ పంపిణీ కొనసాగుతుందని జేసీ డా. వినోద్‌కుమార్ తెలిపాడు. లబ్ధిదారులు తప్పనిసరిగా మాస్కులు ధరించి రేషన్ దుకాణాలకు వచ్చి సరుకులు తీసుకోవాలని, రేషన్ దుకాణాల్లో రద్దీ నివారించేందుకు రోజుకు వందమంది మాత్రమే రావాలని సూచించాడు. నవశకంలో భాగంగా నూతన రేషన్‌కార్డులను రైస్‌కార్డులుగా మార్చామని, సచివాలయంలోనే వీటిని తీసుకోవచ్చని చెప్పాడు.

### భూముల విలువ పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయం

జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, సుడా పరిధిలోని భూములు, స్థలాల మార్కెట్ విలువను పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు సంబంధించిన వివరాలు www.registration.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని, ప్రజలు ఈ వివరాలు పరిశీలించి మార్కెట్‌రేట్‌ల విషయంలో అభ్యంతరాలేమైనా ఉంటే ప్రభుత్వానికి తెలియజేయాలని పేర్కొన్నాడు.

## రాష్ట్ర సమగ్రాభివృద్ధికే.. మూడు రాజధానులు



రాష్ట్ర సమగ్రాభివృద్ధికే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని, ప్రజల అభ్యున్నతికి ఈ నిర్ణయం ఎంతగానో దోహదం చేస్తుందని వైయస్సార్సీపి నాయకులు పేర్కొన్నారు. ఈనెల 1న నెల్లూరులోని కరెంటాఫీస్ సెంటర్‌లో దివంగత సిఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వైయస్సార్సీపి నాయకులు పాలాభిషేకం చేసి మూడు రాజధానులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు తాటి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదేశాలతో మూడు రాజధానులకు మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మూడు రాజధానులకు సంబంధించిన బిల్లులను గవర్నర్ ఆమోదించడం హర్షదాయకమన్నారు.

కార్పొరేషన్

## ఇన్‌చార్జి ఎస్ఇగా సంజయ్

నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్.ఇగా సంజయ్ నియమితులయ్యారు. ఇప్పటిదాకా ఎస్ఇగా ఉన్న ఇమాముద్దీన్ ఇటీవలే ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఇంజనీరింగ్ విభాగంలో ఇ.ఇగా ఉన్న సంజయ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఈనెల 1న ఉత్తర్వులు జారీచేశారు.

కాంగ్రెస్ సేవాదళాధిపతిగా

## కొండా అనిల్‌కుమార్



జిల్లా కాంగ్రెస్‌లో పార్టీ మీడియా వ్యవహారాల పర్యవేక్షకునిగా పనిచేస్తున్న కొండా అనిల్ కుమార్‌ను జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షునిగా నియమిస్తూ అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు లాల్‌జీ దేశాయ్ ఆదేశాలు జారీచేశాడు. నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఈనెల 2న కొండా అనిల్‌కు డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆ నియామక ఉత్తర్వులను అందజేశాడు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు టి.యలమందారెడ్డి ఆదేశాలతో, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి కృషితో తనను ఈ పదవిలో నియమించారంటూ వారికి తన కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా కొండా అనిల్‌ను పార్టీ కార్యకర్తలు, నాయకులు అభినందించారు.

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని

## దెబ్బతీయొద్దు

**- కోటంరెడ్డి శీనయ్య**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మూడు ప్రాంతాల ప్రజల మనోభావాలతో చెలగాటమాడుతున్నారని, ఎన్నికల సమయంలో అమరావతికి మద్దతునిచ్చిన జగన్ ఇప్పుడు మాట మార్చారని, రాజధాని రైతుల గుండెఘోషను సిఎం పట్టించుకోవడం లేదని, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని నెల్లూరు నగర టిడిపి నాయకుడు కోటంరెడ్డి శీనయ్య అన్నాడు. ఈనెల 1న ఆయన నెల్లూరులోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతినే రాజధానిగా ప్రకటిస్తారన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, ఆకుల హనుమంతు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## గవర్నర్ పుట్టినరోజున రక్తదానం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర రెడ్‌క్రాస్ అధ్యక్షులు బిశ్వభూషణ్ హరిచందన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 3న నెల్లూరులోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ అధ్యక్షులు కెవిఎన్ చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్ యస్.ప్రభాకర్‌రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం ఆవశ్యకతను తెలుసుకుని ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చాడు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యవసర చికిత్సలకు మరియు తలసీమియా బాధితులైన చిన్నారులకు రక్తం అవసరం అవుతోందని, కనుక దాతలు ముందుకువచ్చి రక్తదానం చేయాలని కోరాడు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌జైన్, కమిటీ సభ్యులు యల్‌వి నరసారెడ్డి, వై.సురేష్, బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ సిహెచ్ అజయ్‌బాబు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన విఎస్‌యు వీసీ, రిజిస్ట్రార్‌లు



విక్రమసింహపురి యూనివర్సిటీ (విఎస్‌యు) వీసీ ఆర్.సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డిలు ఈనెల 3న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విఎస్‌యులో జరుగుతున్న అభివృద్ధిపనులను వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పరీక్షల నిర్వహణ, ఆన్‌లైన్ తరగతులు, కొత్త అడ్మిషన్లు తదితర అంశాలను వివరించారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించాలని వారు కలెక్టర్‌ను ఆహ్వానించారు. విఎస్‌యులో అభివృద్ధి కార్యక్రమాలను విన్న కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ, విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

## కోవిడ్ బాధితులకు టిడిపి హెల్ప్‌లైన్



కరోనా బాధితులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ టిడిపి ఆరోగ్యవిభాగం నేతృత్వంలో నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఒక సహాయ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. ఏపిఎంఐఎస్‌డిసి మాజీ ఛైర్మన్ డాక్టర్ జడ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కేంద్రాన్ని టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఈనెల 2న ప్రారంభించాడు. అనంతరం రవిచంద్ర మాట్లాడుతూ కరోనా వ్యాధి రోజురోజుకు విస్తరిస్తున్న నేపథ్యంలో పేదలకు అండగా నిలవాలన్న రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ కార్యక్రమం ప్రారంభించామని, బాధితుల కోసం ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నామని చెప్పాడు. ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని, శానిటైజర్లు ఉపయోగించుకోవాలని, తరచూ చేతులు సబ్బుతో పరిశుభ్రం చేసుకుంటూ ఉండాలని, స్వీయనియంత్రణలో ఉంటూ అత్యవసరమైతే తప్ప వీధుల్లోకి రావద్దని, వచ్చినా భౌతికదూరం తప్పనిసరిగా పాటించాలని సూచించాడు. ఆ తర్వాత పేదలకు విటమిన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కాకర్ల తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీకైన పవిత్ర బక్రీద్ పండుగను ఈనెల 1న జిలావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముస్లింసోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోవిడ్ నిబంధనల మేరకు మాస్కులు ధరించి, భౌతికదూరం పాటించి మసీదుల్లో ప్రార్థనలు చేశారు. అనేకమంది ఇళ్ళవద్దనే ఈ పండుగను జరుపుకున్నారు. బంధుమిత్రులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కరోనా వైరస్ తొలగిపోవాలని, మానవాళి అంతా సుఖంగా జీవితాలు సాగించాలని అనేకచోట్ల ప్రార్థనలు చేశారు.

## ఇస్కాన్‌లో ఊంజల్‌సేవ



నెల్లూరులోని ఇస్కాన్‌మందిరంలో ఈనెల 1న రాధాకృష్ణులకు ఊంజల్‌సేవ నిర్వహించారు. మందిరం అధ్యక్షులు శుకదేవ స్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలను పురస్కరించుకుని గతనెల 30 నుంచి ఇక్కడ వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈనెల 3న బలరామజయంతి నిర్వహించామని, 12న శ్రీకృష్ణాష్టమిని నిర్వహిస్తామని చెప్పారు.

శబరి శ్రీరామక్షేత్రం

## 20వ వార్షికోత్సవ వేడుక

నెల్లూరు రామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రం 20వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 1న ఆలయంలో జరిగాయి. నేత్రపర్వంగా జరిగిన ఈ వేడుకలో భాగంగా స్వామివారిని సుందరంగా అలంకరించి స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం రామనామ హోమం నిర్వహించి పూర్ణాహుతి చేపట్టారు. లోకకల్యాణం కోసం కరోనా వ్యాధిని నివారించాలని ప్రార్థిస్తూ సీతారాముల కల్యాణం నిర్వహించారు.

దత్తాత్రేయమఠంలో

## శనీశ్వర హోమం

నెల్లూరు, పప్పులవీధిలోని శ్రీ గురు దత్తాత్రేయ మఠంలో ఈనెల 1న 'శని త్రయోదశి'ని పురస్కరించుకుని శనీశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదేశాలతో అర్చకుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు. గ్రహశాంతి హోమంతో పాటు, భక్తుల గోత్ర నామాల పేరుతో స్వామివారికి తైలాభిషేకాలు, శాంతిపూజలు నిర్వహించారు.

ప్రభుత్వ సంక్షేమ ఫలాలకు..

# అర్హత ఉంటే అందించాల్సిందే

- మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి, జౌళి, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు. ఈనెల 3న ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలం అభివృద్ధిపై నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ఇళ్ళు లేని పేదలందరికీ ఇళ్ళ స్థలాల మంజూరుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించాడు. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను గడువులోగా పూర్తిచేయాలని, కౌలు రైతులందరికీ కార్డులు అందజేయాలని, డిసిపల్లి పరిధిలో దెబ్బతిన్న సోమశిల ఉత్తర కాలువ రెండు తూములను మళ్ళీ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, పొగాకు రైతులు ఉత్పత్తులు అమ్ముకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాడు. అనంతరం కరోనా పరిస్థితిపై ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి సమీక్షించాడు. ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో క్వారంటైన్ సెంటర్‌లో కోవిడ్ బాధితులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాడు. ఆర్డీఓ ఉమాదేవి, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, వైకాపా నాయకులు సుబ్బారెడ్డి, రవీంద్రబాబు, కోనంకి శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికల్లో.. ఉదయగిరి విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన ఆటోమోటివ్ ఇండియా ప్రై.లిమిటెడ్ కంపెనీవారు ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ ప్రాంగణ ఎంపికల్లో ఉదయగిరి మెరిట్స్ కళాశాలకు చెందిన మెకానికల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఎంపికల్లో ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు ఏడాదికి రెండున్నర లక్షల రూపాయల వేతనం పొందనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి కెవి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## నరసింహకొండపై దర్శనాలు రద్దు

నెల్లూరు, నరసింహకొండ(వేదగిరి)పై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ దర్శనాలను ఆలయ అధికారులు రద్దు చేశారు. ఆలయం దగ్గరలో ఉన్న ఓ దుకాణాదారుడికి కోవిడ్ వైరస్ సోకడంతో భక్తుల ఆరోగ్యం దృష్ట్యా కొండపై స్వామివారి దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ఆలయ ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి ఈనెల 1న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారికి నిత్యపూజలు, సేవలు ఏకాంతంగా కొనసాగుతాయని, అయితే భక్తులకు మాత్రం అనుమతి లేదని, భక్తులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# కలెక్టర్ గారూ!.. శెభాష్!

● చంద్రపడియ ఘటనలో బాధితుల పట్ల స్పందనకు సర్వత్రా ప్రశంసలు

**ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటుండడం సాధారణమైన విషయమే. అయితే కొత్తగా కలెక్టర్‌గా వచ్చిన చక్రధర్‌బాబు ఈ విషయంలో మరో అడుగు ముందుకు వేసి అత్యంత వేగంగా బాధితులకు, బాధిత కుటుంబాలకు సత్వరసాయం అందించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. ప్రమాదం జరిగిన నాలుగు రోజులలోపే బాధిత కుటుంబాలకు పెద్దమొత్తంలో పరిహారం అందివ్వడం జిల్లాలో గతంలో ఎప్పుడూ జరగలేదు. బాధితుల పట్ల ఇంతగా శ్రద్ధ చూపుతూ వారిని అన్ని విధాలా ఆదుకుంటున్న కలెక్టర్ చక్రధర్‌బాబును అందరూ అభినందిస్తున్నారు. అందుకు ప్రత్యేకించి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా అండదండలందిస్తూ కలెక్టర్ ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు ఆమోదిస్తుండడం అభినందనీయం!**

వింజమూరు మండలం చంద్రపడియలోని ఫార్మా కర్మాగారంలో గతనెల 29న జరిగిన పేలుడు ఘటనలో శరీరం కాలిపోయి విలవిల్లాడుతున్న బాధితులకు సత్వర సాయం అందించడంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు కృషికి సర్వత్రా ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. గత నెల 29న ఆ ఫ్యాక్టరీలో పేలుడుప్రమాదం జరగడంతోనే బాధితులు నెల్లూరు కిమ్స్ ఆసుపత్రిలో చేర్చగా కలెక్టర్ వెంటనే వెళ్ళి వారిని పరామర్శించడం, వారికి మెరుగైన వైద్యం లభించేందుకు చర్యలు తీసుకోవడంతో, బాధితులకు తక్షణ సాయంగా 10వేల రూపాయలు అందించడం, అక్కడ నుంచి నేరుగా చంద్రపడియ గ్రామానికి వెళ్ళి ఫ్యాక్టరీని, ప్రమాద ఘటనా స్థలిని పరిశీలించడం అన్నీ ఏకబిగిన చేయడంతో కార్మికులకు, బాధితులకు కొంత ఊరట కలిగించింది. ఈ ప్రమాదంలో గాయపడిన నలుగురు కార్మికులను మెరుగైన వైద్యం అందించేందుకు నెల్లూరు కిమ్స్ ఆసుపత్రి నుంచి చెన్నైలోని అపోలో ఆసుపత్రికి తరలించడమే కాక, వారికి సహాయంగా రెవెన్యూ అధికారుల బృందాన్ని కూడా పంపడం విశేషం. అంతే కాదు, చెన్నైలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్న తన సహచరుని సాయంతో ఇక్కడి బాధితులు అపోలో ఆసుపత్రిలో వెంటనే అడ్మిట్ అయ్యేందుకు కలెక్టర్ కృషి చేయడం కూడా విశేషం!

### మృతుని కుటుంబానికి 35 లక్షల పరిహారం :

ఈ ప్రమాదంలో మృతిచెందిన ఒక కార్మికుని కుటుంబానికి జిల్లా కలెక్టర్ ఈనెల 1వ తేదీన 35 లక్షల రూపాయల పరిహారాన్ని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి అందజేశారు. జిల్లా కలెక్టర్ చొరవతో ఇంత పెద్ద మొత్తంలో పరిహారం అందడం బహుశా జిల్లాలో ఇదే ప్రథమం కావచ్చునని అంటున్నారు. మృతుని కుటుంబానికి ఆ పరిహారంతో పాటు, మృతుని భార్యకు అదే జీతంతో అదే ఫ్యాక్టరీలో ఉద్యోగం వచ్చేలా చేశారు. అంతేకాదు, ఆత్మకూరులో ఇంటిస్థలం, ఇంటి మంజూరు పత్రం కూడా మృతుని కుటుంబానికి అందించనున్నారు.

ప్రమాద ఘటనలో తీవ్రగాయాలపాలైన మిగిలిన ముగ్గురికి కూడా భారీ సాయాన్నే అందించారు. ఒక్కొక్కరికి ఏడు లక్షల రూపాయల పరిహారంతో పాటు వారు తిరిగి ఆరోగ్యంగా కోలుకునేవరకు వేతనంతో కూడిన సెలవు ఇప్పించారు. అపోలో ఆసుపత్రిలో వారికి అందుతున్న వైద్యచికిత్సలకు అవసరమైన ఖర్చంతా ఫ్యాక్టరీ యాజమాన్యమే భరించేలా కలెక్టర్ చక్రధర్‌బాబు సత్వర చర్యలు తీసుకోవడం, బాధితుల పట్ల ఇంతగా కలెక్టర్ స్పందించడం అందరి ప్రశంసలకు పాత్రమవుతోంది.

### ప్రమాదంపై విచారణకు చకచకా చర్యలు :

ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే బాధితులను ఆదుకునేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రమాదానికి కారణాలు తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ విచారణ కమిటీని నియమించాడు. కాలుష్య నియంత్రణామండలి, పరిశ్రమలశాఖ, ఆత్మకూరు ఆర్‌డిఓ తదితరులతో కూడిన ఆ కమిటీ ఫ్యాక్టరీలోని పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ప్రమాద కారణాలను కనుగొని జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనుంది. ఈ వ్యవహారాలన్నిటినీ స్వయంగా కలెక్టరే ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాడు కూడా.

ఇలా ప్రమాద ఘటనకు వెంటనే స్పందించి ఎప్పటికప్పుడు బాధితులకు అండగా తగు చర్యలు తీసుకుంటున్న జిల్లా కలెక్టర్‌ను అందరూ శెభాష్ అంటున్నారు.

# 'బండి' నడవదు.. బతుకు గడవదు






## కష్టాలమయంగా.. 'తోపుడుబండ్ల' జీవితాలు

మనం నిద్రమంచం లేచిన దగ్గరి నుంచి మన వీధిలోకి కూరగాయలమ్మేవాళ్ళు..రకరకాల పండ్లు, పూలు అమ్మేవాళ్ళు.. కొబ్బరి బోండాలు లేదా బొప్పాయిపండ్లు అమ్మేవాళ్ళు, పాతసామాను తీసుకుని ఎరగడ్డలో డబ్బులో ఇచ్చేవాళ్ళు.. ఇలా ఎంతోమంది తోపుడుబండ్ల వాళ్ళు వస్తూనే ఉండేవాళ్ళు. ఈతపళ్ళు, నేరేడుపళ్ళు, జామకాయలు, తేగలు వగైరాలన్నీ ఇప్పుడు బుట్టల్లోంచి తోపుడు బండ్లమీదికి వచ్చేశాయి. గతంలో బుట్టల్లో పెట్టుకుని కూరగాయలమ్ముకునేవాళ్ళు కూడా ఇప్పుడు తోపుడు బండ్లమీదనే వాటిని తీసుకొచ్చి అమ్ముకుంటున్నారు. బయట ఎక్కడో దూరంగా ఉన్న మార్కెట్ దాకా వెళ్ళి రోజూ పండ్లో కూరలో కొనుక్కోవాలనుకునే వాళ్ళకి ఆ శ్రమ లేకుండా ఇళ్ళ ముందుకే తోపుడు బండ్ల వాళ్ళు వస్తుండేవాళ్ళు. అయితే, ఇప్పుడా పరిస్థితి పోయింది. కరోనా దెబ్బతో అలాంటి దృశ్యాలన్నీ క్రమేణా కనుమరుగైపోతున్నాయి. ఎక్కడ చూసినా వీధులన్నీ నిర్మానుష్యంగానే ఉంటున్నాయి. కరోనా అంటుకుంటుందేమోనన్న భయంతో, అత్యవసరమైతే తప్ప ఎవరూ వీధుల్లోకి రావడం లేదు. వచ్చినా తోపుడుబండ్లమీది సరుకుల్ని కొని తినే సాహసం చేయడం లేదు. దీంతో ఆ చిరు వ్యాపారుల జీవనం అస్తుబిస్తుగా మారింది. ఎంతో శ్రమకోర్చి వీధుల్లో తిరుగుతూ సరుకులు అమ్ముకునే వాళ్ళంతా..ఇప్పుడు ఇళ్ళల్లోనే ఉండిపోయి జీవనం గడవక.. ఎలా బతకాలి దేవుడా అనుకుంటూ దిగులు పడిపోతున్నారు.

### చిరు వ్యాపారాలకు కరోనా కాటు

ఒక్క నెల్లూరు నగరంలోనే కాదు జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లోనూ, గ్రామస్థాయిలోనూ కూడా తోపుడు బండ్ల మీద వ్యాపారాలు చేసుకునే వారే ఎక్కువ. తోపుడుబండ్లపై ఇడ్లీలు పెట్టుకుంటూనో, దోసెలు పోసుకుంటూనో, బజ్జీలు బోండాలు వేసుకుంటూనో జీవనం సాగించేవారు ఎంతోమంది ఉన్నారు. ఈ చిరువ్యాపారాలు చేసుకునేవాళ్ళంతా అత్యధికశాతం మంది నిరుపేదలే. ఇలాంటి వాళ్ళు జిల్లాలో వేల సంఖ్యలోనే ఉన్నారు. వీళ్ళ మీద ఆధారపడ్డ కుటుంబాలతో కలిపితే వీళ్ళ సంఖ్య లక్షల్లోనే ఉంటుందని అనుకోవచ్చు. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో కరోనాకి భయపడి ఎవరూ వ్యాపారాలను చేసుకోలేకపోతున్నారు. కరోనా ఎవరినీ వదలడం లేదు. ఆ మాయదారి వ్యాధి అన్ని ప్రాంతాల్లోకి జొరబడుతుండడంతో ఇలాంటి చిరువ్యాపారాలన్నిటినీ ఎవరికి వారు నిలిపేయక తప్పడం లేదు. ఒకవేళ కొన్ని ప్రాంతాల్లో తిరిగేందుకు తోపుడుబండ్లకు ఇబ్బంది లేకున్నా, వీటిమీద తెచ్చే సరుకులను కొనేవారు నామమాత్రంగానే ఉంటున్నారు. దీంతో ఎంతో కష్టపడి తెచ్చుకున్న సరుకులను అమ్ముకోలేక వారు పడే బాధలు వర్ణనాతీతం. గొంతెండిపోయేలా అరుస్తూ.. కాళ్ళరిగిపోయేలా తిరిగినా అవి అమ్ముడుపోక చివరికి నిరాశతో ఇళ్ళకు తిరిగివెళ్ళిపోతున్నారు. ఇళ్ళలో పిల్లలు, పెద్దలు అందరూ అర్ధాకలితోనో, లేదా పస్తులతోనో అప్పులతోనో జీవితాలు గడపాల్సివస్తోంది. తోపుడుబండ్లపై వ్యాపారాలు చేయడానికి అలవాటు పడిన వీరంతా ఇతరత్రా ఏ పనీచేయడం తెలియని వారే. తోపుడుబండ్లు నడిస్తే తప్ప బతుకుబండ్లు నడవని వారెందరో ఉన్నారు.

### అమ్మినా.. కొనేవాళ్ళు లేరు

ఒకవైపు కరోనా మహమ్మారి జిల్లా అంతటా విజృంభిస్తుండడంతో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ప్రాణాంతకమైన ఈ కోవిడ్ వైరస్‌ను నియంత్రించేదుకు ప్రభుత్వం, అధికారులు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో చిరువ్యాపారాలకు చాలా చోట్ల బ్రేక్ పడిపోయింది. మునుపటిలాగా వీధుల్లో తిరగడం ఎంతో ఇబ్బందికరంగానే కాదు ప్రమాదకరంగా కూడా ఉంది. నగరంలోనూ అనేక ప్రాంతాల్లో కరోనా ఉధృతి కొనసాగుతుండడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు నిషేధిస్తూ కంటైన్మెంట్‌జోన్లు ఏర్పడ్డాయి. కరోనా పొంచివున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాణాలే ముఖ్యం కనుక, ఎవరూ వీధుల్లోకి రావడం లేదు. స్వీయనియంత్రణతోనే రోజులు గడుపుతున్నారు. ఎవరికి ఎప్పుడు ఎలా ఈ వైరస్ అంటుకుంటుందో తెలియదు కనుక వీధుల్లోకి వచ్చి ఏమైనా కొనాలంటేనే జనం భయపడుతున్నారు. ఒకవేళ ఏ తోపుడుబండో వీధిలోకి వచ్చినా అందులోని సరుకులను కొనే పరిస్థితి ఉండడం లేదు. బతుకు జీవనం కోసం తోపుడుబండ్లు పెట్టుకుని, పండ్లో పూలో తెచ్చి అమ్ముదామనుకుంటున్నా.. అవన్నీ మధ్యాహ్నానికి బండి మీదనే ఎండిపోతున్నాయే తప్ప కొనేవారు లేరు. దీంతో అదనపు నష్టాలు, కష్టాలే ఎదురవుతుండడంతో వాళ్ళు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. ఈ కరోనా దెబ్బతో గత నాలుగు నెలలుగా ఇదే దుస్థితి. దీంతో, కొద్ది పెట్టుబడితోనే చేసుకునే ఈ చిన్న వ్యాపారాలకు పెద్దషాక్ ఇచ్చినట్లయింది. పూట గడిచేందుకు తోపుడుబండి నడుపుకుందామన్నా ఇప్పుడు పరిస్థితులు సహకరించడం లేదని, ఆ బండి నడవకుంటే తమ బతుకు గడవదని తోపుడుబండ్ల వాళ్ళు ఆవేదన చెందుతున్నారు. ఈ మాయదారి కరోనా పీడ ఎప్పుడు విరగడవుతుందో కానీ.. అప్పటిదాకా తమ బతుకులింతేనని వారు దిగులుతో చెప్తున్నారు. ప్రభుత్వం, ఆయా ప్రాంతాల్లోని ఉన్నతాధికారులు తమ దుస్థితిని గమనించి ఈ కరోనా కష్టాల నుంచి తాము బయటపడేందుకు ఆర్థికంగా చేయూతనివ్వవలసిందిగా వారు కోరుకుంటున్నారు.

# మూడు రాజధానులతోనే సమగ్రాభివృద్ధి

**ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు**



మూడు రాజధానుల ఏర్పాటుతో పరిపాలన వికేంద్రీకరించాలన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయంతో మహానేత దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఆశించినట్లుగా అన్ని ప్రాంతాలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయని హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్రంలో మూడు రాజధానుల ఏర్పాటుకు మద్దతుగా ఈనెల 3వ తేది సాయంత్రం గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ మూడు రాజధానులతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని అన్నాడు. గూడూరు పట్టణ అద్యక్షులు బొమిడి శ్రీనివాసులు, రూరల్ అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ ఛైర్మెన్ బాబురెడ్డి, వైకాపా అధికార ప్రతినిధి నాసిన నాగులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మనుబోలు సతీష్‌రెడ్డి, నాయకులు నరసయ్య, చోళవరం గిరిబాబు, మనోహర్ మురళి గౌడ్, కమలాకర్‌రెడ్డి, వినీష్, వంశీ, సందాని, తూపిలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# కోవిడ్ సెంటర్‌కు పరికరాల వితరణ

**- సేవాభావం చాటుకున్న పేర్నాటి ట్రస్ట్ అధినేత శ్యామ్**



గూడూరు సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పిలుపుతో పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ అధినేత పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గూడూరులోని కోవిడ్ సెంటర్‌కు ఉపయోగపడే పలు రకాల పరికరాలను రెండు వీల్‌ఛైర్లను, స్ట్రెచర్, 8 డస్ట్‌బిన్లు, ప్లాస్టిక్ కుర్చీలు, స్టెతస్కోప్‌లు, రెండు పెద్ద టీవీలు, ఆక్సిమీటర్లు, మాస్కులు, హ్యాండ్ గ్లౌజ్‌లు, శానిటరీ కిట్‌లు వగైరాలన్నిటినీ సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అందజేశాడు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సబ్ కలెక్టర్ ఫోన్ చేయగానే తన బాధ్యతగా భావించి వారు చెప్పిన వస్తువులన్నీ ఒక్కరోజులోనే అందించడం జరిగిందన్నాడు. గూడూరు ప్రజలకు ఏమి సహాయం కావాలన్నా అందించేందుకు పేర్నాటి ట్రస్ట్ ముందువరుసలో ఉంటుందన్నాడు. యువ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ నిబద్ధత కలిగిన అధికారి అని, అలాంటి అధికారి గూడూరుకు రావడం, ఈ కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకునేందుకు ఎంతగానో కృషిచేస్తుండడం సంతోషకరమని, త్వరలో సబ్ కలెక్టర్ సూచనలతో కరోనా బాధితులుండే కోవిడ్ సెంటర్‌లో వారి ఆరోగ్యం కోసం యోగా తదితర కార్యక్రమాల ఏర్పాటుకు కృషిచేస్తామని, ఇదేవిధంగా రమణారెడ్డి అనే దాత కూడా కోవిడ్ సెంటర్‌కు పడకలు సమకూర్చేందుకు సేవాభావంతో ముందుకు వచ్చారని, వాటిని కూడా త్వరలోనే సబ్‌కలెక్టర్ సమక్షంలో అందజేస్తామన్నాడు. సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, డిప్యూటి డిఎం అండ్ హెచ్ఓ అచ్యుతకుమారి, గూడూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమ, దాత రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నెల్‌క్యాస్ట్ గ్రీన్‌బెల్ట్

గూడూరు నెల్‌క్యాస్ట్ పరిశ్రమ యాజమాన్యం, ఇండస్ట్రియల్ ఏరియా, నెల్‌క్యాస్ట్ నగర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం 200 చెట్లు నాటడం జరిగిందని నెల్‌క్యాస్ట్ పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) ఎన్.సుదర్శనరెడ్డి తెలిపాడు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇండస్ట్రియల్ ఏరియా, పరిసర ప్రాంతాలలో చెట్లు నాటడం జరుగుతుందని, అలాగే ఈ సంవత్సరం కూడా నాటడం జరిగిందని, దీనివల్ల వాతావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపాడు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్(ఫైనాన్స్) దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, డీజీఎం (హెచ్ఆర్) టి.మురళీకృష్ణ, మేనేజర్(పబ్లిక్ రిలేషన్స్) ఆనిమెళ్ళ శివకుమార్, సెక్యూరిటీ మేనేజర్ పి.రామ్మోహన్, ఆర్.శశికుమార్, వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో..**

# 90 కుటుంబాలకు కూరగాయలు



గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 2న సంస్థ కార్యవర్గసభ్యుడైన తిరుమలరావు సహాయసహకారాలతో అశోక్‌నగర్‌లోని రెడ్‌జోన్ ప్రాంతంలో ఉన్న 90 కుటుంబాలవారికి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతులమీదుగా వారానికి సరిపడా కూరగాయలను అందజేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు బాలయ్యనాయుడు, కార్పొరేషన్ రవికుమార్, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, గ్రానైట్ ప్రభాకర్, మేకల మస్తానయ్య, కోఆర్డినేటర్ సతీష్, వలంటీర్లు పాల్గొన్నారు.

**సిఆర్ రెడ్డి హాస్పిటల్‌లో**

# తల్లిపాల వారోత్సవాలు



గూడూరు పట్టణంలోని డాక్టర్ సి.ఆర్.రెడ్డి హాస్పిటల్‌లో ఈ నెల 4వ తేదీ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గర్భవతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలను అందించాలని, తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, అలాగే వ్యాధులు రాకుండా ఉంటాయని తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ సందర్భంగా గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షించిన అనంతరం వారికి న్యూట్రిషన్ టిన్నులు, పాలపొడి డబ్బాలను అందజేశారు. అలాగే జీవన్‌రెడ్డి సహకారంతో కార్యక్రమంలో పాల్గొన్న 30 మంది తల్లులకు, గర్భిణులకు బిస్కెట్ ప్యాకెట్‌లు అందజేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు టి.కమలసాయి, మహిళా మండలి కార్యదర్శి విష్ణు వందన, జీవనిరెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**'ఇత్తెహాద్' సేవా సంస్థ బృందానికి..**

# పిపిఇ కిట్స్ పంపిణీ



గూడూరులో సొంతనిధులతో శానిటైజింగ్ కార్యక్రమాలు చేపడుతున్న ఇత్తెహాద్ టీమ్‌కు వైకాపా నాయకులు షేక్ ముజాహిద్ ఇటీవల పిపిఇ కిట్స్ అందజేశాడు. ఈ సందర్భంగా ముజాహిద్ మాట్లాడుతూ ఇత్తెహాద్ బృందం సభ్యులు పట్టణంలోని రెడ్‌జోన్ ప్రాంతాలకు కూడా ధైర్యంగా వెళ్ళి శానిటైజేషన్ కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో కూడా శానిటైజేషన్ నిర్వహించారని అన్నాడు. కోవిడ్ వైరస్ తీవ్రంగా ప్రబలుతున్న తరుణంలో ఆ బృందానికి పిపిఇ కిట్స్ అందజేశామన్నాడు. ఈ కార్యక్రమంలో ఆ బృందం సభ్యులు పాల్గొని ముజాహిద్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# కరోనాతో అప్రమత్తంగా ఉండాలి



కరోనా వైరస్ విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నాడు. గూడూరు ఐసిఎస్‌సి రోడ్డు ప్రాంతంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక కూరగయాల మార్కెట్‌ను ఆయన ఈనెల 5న అధికారులతో కలసి పరిశీలించాడు. ప్రజలు మాస్కులు ధరించి, భౌతికదూరం పాటిస్తుండాలని, అన్ని రకాల ముందుజాగ్రత్తలు తీసుకోవాలని, గూడూరులో త్వరలో కొత్త కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నాడు. గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, వైకాపా నాయకుడు బత్తిన విజయకుమార్, టౌన్ సిఐ దశరథరామయ్య, ఒన్‌టౌన్ ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

# భౌతిక దూరం పాటించని మందుబాబులు



మందుబాబులు మద్యం దుకాణాల వద్ద భౌతిక దూరం పాటించడం లేదు. దీంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అసలే పట్టణంలో కరోనా కేసులు తీవ్రంగా ప్రబలుతున్నాయి. చాలామంది ఇళ్ళ నుండి బయటకొచ్చేందుకు హడలిపోతున్నారు. ముఖ్యమైన పనులుంటేనే ప్రజలు మాస్కులు ధరించి బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో మందుబాబులు పట్టణంలోని మద్యం దుకాణాల వద్ద కనీసం భౌతిక దూరం పాటించకుండానే ఒకరిపై ఒకరు పడి మద్యం కొనుగోలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మద్యం దుకాణాల వద్ద సామాజికదూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంది.

# సీనియర్ పాత్రికేయుడు సత్యంరెడ్డి కన్నుమూత



సీనియర్ పాత్రికేయుడు గుండాల సత్యంరెడ్డి (52) ఈనెల 6న సూళ్ళూరుపేటలోని ఆయన నివాసంలో కన్నుమూశాడు. ఆయనకు భార్య, ఒక కొడుకు కూతురు ఉన్నారు. గతకొద్ది రోజులుగా ఆయన అస్వస్థతతో ఉన్నాడు. పలు దినపత్రికల్లో సూళ్ళూరుపేట, శ్రీహరికోట వార్తలు రాయడంలో దిట్టగా ఆయన పేరు సంపాదించుకున్నాడు. 'రాజీ' అనే కలం పేరుతో కథలు, కవితలు రాసి మంచి కవిగా కూడా గుర్తింపు తెచ్చుకున్నాడు. శ్రీసిటీ పిఆర్ఓగా తడ, వరదయ్యపాళెం, సత్యవేడు, సూళ్ళూరుపేట పాత్రికేయులకు అందుబాటులో ఉండి అందరి అభిమానం చూరగొన్నాడు. పాత్రికేయునిగా, కవిగా మంచిపేరు తెచ్చుకున్న సత్యంరెడ్డి మృతికి చింతిస్తూ ఆయన కుటుంబానికి సంతాపం తెలుపుతోంది 'లాయర్'!...

# కోవిడ్ బాధితులకు అండగా.. శీనయ్య ట్రస్టు

- 2 లక్షల విరాళం అందజేసిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న
- బుచ్చిలో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు



కరోనా బాధితులకు తమవంతుగా సాయం అందించేందుకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రెండు లక్షల రూపాయల విరాళం ప్రకటించి తన సేవా భావాన్ని చాటుకున్నాడు. ఆ చెక్కును బుచ్చి ఎంపిడిఓ నరసింహారావుకు ఎమ్మెల్యే అందజేశారు.

ఈనెల 2న ఇందుకూరుపేట మండలం కొరుటూరుపాళెంలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి నిధులు 5 లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రసన్న ప్రారంభించాడు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ కరోనా బాధితుల కోసం బుచ్చిరెడ్డిపాళెంలో గుత్తికొండ శ్రీరాములు కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో సుమారు 200 పడకలతో కోవిడ్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందన్నాడు. పల్లె ప్రాంతాల్లోనూ కరోనా వ్యాపిస్తున్న నేటి పరిస్థితుల్లో ప్రజలంతా ఈ వ్యాధిపట్ల అత్యంత జాగ్రత్తలతో ఉండాలన్నాడు.

### న్యాయం ధర్మం.. జగన్ వైపే ఉన్నాయి :

రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయం తీసుకున్నారని, ఈ బిల్లులను గవర్నర్ ఆమోదించడం రాష్ట్రానికి శుభ పరిణామమని అన్నాడు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం, ధర్మం వైయస్ జగన్‌వైపే ఉన్నాయని, టిడిపి హయాంలో రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు చేసిందేమీలేదని విమర్శించాడు. ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపిడిఓ రఫీఖాన్, నాయకులు షేక్ షబ్బీర్, స్వర్ణా నాగేశ్వర రెడ్డి, పామంజి శ్రీనివాసులు, గండవరం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాపకశక్తిలో భళా!..

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి కలువాయి బుడ్డోడు



ఓ పదిపేర్లు గుర్తుపెట్టుకుని తడుముకోకుండా చెప్పాలంటే పెద్దలకు కూడా కొంచెం కష్టమే. అయితే అనేక దేశాల జెండాల పేర్లు, జాతీయ నాయకుల పేర్లు టకటకా చెప్పడమంటే చిన్న విషయమేమీ కాదు. కానీ మూడేళ్ళ వయసున్న ఆ బుడతడు అపారమైన జ్ఞాపకశక్తితో అలాంటివన్నీ టకీమని చెప్పేస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు.

జిల్లాలోని కలువాయికి చెందిన వియాన్ వంశీ తన ప్రతిభను చాటుకుంటూ అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాడు. ఆసియా ఖండంలోని 59 దేశాల జాతీయ పతాకాల పేర్లు, 19 మంది భారతదేశ జాతీయ నాయకుల పేర్లు, 10 జాతీయచిహ్నాల పేర్లు, 20 రకాల పండ్లు, 25 రకాల కూరగాయలు, 30 రకాల వాహనాల పేర్లను అత్యంత తక్కువ సమయంలో టకటకా చెప్పేయడంలో వంశీ ఘనాపాటి. ఈ బుడతడి ప్రతిభకు మెచ్చి ఇటీవలే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వంశీ పేరు నమోదు చేసుకోవడం విశేషం. చెన్నైలోని అడయార్ క్యాన్సర్ వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్లు కలువాయి రమణయ్య-స్వాతి దంపతుల కుమారుడైన వంశీ ప్రతిభను గుర్తించిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు ఆ బాలుడిని అభినందిస్తూ ఇటీవల ధ్రువపత్రాల్ని, మెడల్స్‌ను, షీల్డ్‌ను పంపారు. దీంతో వంశీ కుటుంబీకులు, వారి బంధుమిత్రులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# కరోనా నుంచి పాఠాలు నేర్చుకోవాలి

- పరిశుభ్రత పాటించాలి... రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి
- భగవన్నామ స్మరణతో జీవితాలను శుభప్రదం చేసుకోవాలి
- క్రమశిక్షణే కరోనా నుండి రక్ష

**- ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు శుకదేవస్వామి**



కరోనా వ్యాధి ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న నేపథ్యంలో.. ఆ వ్యాధి గురించి భయపడి ప్రయోజనం లేదు. ధైర్యంగా దానిని ఎదుర్కోవాలి. కరోనాతో పాఠాలెన్నో నేర్చుకోవాలి. ఎవరైనా సరే తెలుసుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన విషయాలున్నాయి. శరీరానికి రోగం, ముసలితనం, చావు అనేవి తప్పవు. అవి ఏనాటికైనా రాక మానవు. అయితే ఆత్మకు మాత్రం చావు లేదు కనుక మనకు చావు లేదని తెలుసుకుని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో చెప్పినట్లుగా యోగా ద్వారా కానీ, భక్తిమార్గం ద్వారా కానీ భయం నుంచి బయటపడి మనోబలాన్ని పెంచుకోవాలి. దానితోపాటు క్రమశిక్షణతో ఉండాలి. దినచర్యలో భాగంగా అత్యంత సులువైన 'హరే రామ! హరే కృష్ణ' మంత్రాన్ని స్మరించుకుంటూ ఆ మంత్రధ్యానంతో మన జీవితాలను పునీతం చేసుకోవాలి. ఈ కరోనా వ్యాధికి మందులేదంటున్నారు కనుక ఎవరి జాగ్రత్తల్లో వారుండాలి.

### మంచి ఆహారం.. ఆరోగ్యానికి మూలం :

కరోనా నుంచి మనం ఎన్నో మంచి విషయాలను కూడా నేర్చుకోవాల్సి ఉంది. బయట తినుబండారాల దుకాణాల్లో చెత్త తిళ్ళు తినకుండా ఉండడం మంచిది. మాంసాహారం అవసరం లేదు శాఖాహారం ఎంతో మంచిది. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కూడా శాఖాహారమే మేలు. తెల్లవారుజామునే నిద్ర లేవడం, నిమ్మరసం-తేనె నీళ్ళు తాగడం, కొమ్ము పసుపుపొడి..కొద్దిగా నిమ్మరసంతో వేడినీళ్ళు తాగడం, ఆహారంలో సీజన్‌లో దొరికే పండ్లు జామ, అరటి, బొప్పాయి, బత్తాయి లాంటి వాటిని తీసుకోవడం ద్వారా రోగనిరోధశక్తి పెరుగుతుంది. అదేవిధంగా కాయగూరల్లో క్యారెట్, ముల్లంగి, టమేటో, కీరదోసకాయ వీటిలో కొద్దిగా సైంధవలవణం, నిమ్మరసం చల్లి తీసుకోవడం మంచిది. రోగనిరోధకశక్తి పెంపొందుతుంది. అదేవిధంగా లేత వేపాకు, కరివేపాకు, పొదీనా, కొత్తిమీర, ముల్లంగి లేత ఆకులు ఎంతో పుష్టికరం. ఒకవేళ జ్వరం జలుబు వగైరాలుంటే రోజూ రెండుసార్లు ఆవిరిపట్టడం, మూడు నాలుగు సార్లు వేడిగా పావుగ్లాసు కషాయం తాగడం వల్ల ఎలాంటి జలుబునైనా అదుపు చేయవచ్చు. కొన్ని లవంగాలు, మిరియాలు, తులసి, అల్లం, బెల్లం బాగా నీళ్ళు మరిగించి ఆ తర్వాత ఆ కషాయాన్ని కొద్దిగా వేడిగా తీసుకోవాలి. మంచి ఆరోగ్యానికి ఇవెంతగానో ఉపయోగపడతాయి.

### అందరూ భక్తితో జీవించాలి :

శరీరం వ్యాధి మందిరం అన్నారు పెద్దలు. ఆత్మజ్ఞానం లేకపోతే ఆధ్యాత్మిక అనుభవం లేకపోతే శరీరాన్ని పట్టుకుని వేళ్ళాడుతుంటాం. పరిశుభ్రతలు పాటిస్తూ క్రమశిక్షణతో ఉంటూ చిత్తశుద్ధితో భగవన్నామాన్ని స్మరించుకుంటుంటే ఆరోగ్యంగా ఉండడమే కాక, జీవితమూ సార్థకం అవుతుంది.

## ఆంధ్ర-తమిళనాడు భక్తుల ఆరాధ్యదైవం..

# సూళ్ళూరుపేట.. శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారు



***నెల్లూరుకు సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న సూళ్ళూరుపేటలో కొలువై ఉన్న శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయం జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఆలయం. నెల్లూరు-చెన్నై రహదారిలో ఈ దేవస్థానం ఉంది. చెంగాళ పరమేశ్వరిదేవి ఇటు ఆంధ్ర, అటు తమిళనాడు భక్తులకు ఆరాధ్యదైవం. నేటికీ అమ్మవారి మందిరానికి తలుపులు లేకపోవడం అమ్మవారి మహిమలకు ప్రతీకగా చెప్పుకోవచ్చు.***



## మన దేవాలయాలు (7)

సకల శుభదాయని, సర్వాభీష్టప్రదాయినిగా చెంగాళమ్మ అమ్మవారు ప్రసిద్ధి. అంతేకాదు మహామహిమాన్వితమైన శక్తులు కల దేవతగా..భక్తుల కోరికలు నెరవేర్చే తల్లిగా చెంగాళ పరమేశ్వరిదేవి ఎంతోకాలం నుంచి తెలుగు-తమిళ రాష్ట్రాల భక్తులను కటాక్షిస్తూనే ఉంది. 1960లో దేవాదాయశాఖ ఆధీనంలోకి వచ్చిన ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది.

### ఆలయ చరిత్ర :

ప్రాచీనకాలంలో సూళ్ళూరుపేటకు 'శుభగిరి'గా పేరుండేది. సూళ్ళూరుపేట పట్టణానికి దక్షిణదిశగా, కాళంగి నదీ తీరాన వెలసిన చెంగాళమ్మ అమ్మవారి దేవాలయం ఉంది. అమ్మవారు స్వయంభువుగా ఇక్కడ వెలశారు. చాలాకాలం క్రితం ఇక్కడున్న కాళంగి నదిలో పశువుల కాపర్లు ఈత కొడుతుండగా నది మధ్యలో ఒక శిలా విగ్రహం దొరికితే గట్టుమీదికి చేర్చి వడుకోబెట్టిన స్థితిలో ఉంచారట. ఈ విషయాన్ని వారు గ్రామస్థులతో చెప్తే వాళ్ళు వచ్చి చూసేసరికి ఆశ్చర్యకరంగా ఆ అమ్మవారి విగ్రహం దక్షిణం వైపు చూస్తున్నట్లుగా నిలబడి ఉందని, అందువల్ల ఆ మూర్తిని 'తెన్ కాళియమ్మ' అంటే, దక్షిణాభిముఖంగా ఉన్న దేవతగా పిలిచేవారని అంటారు. ఆ పేరే 'చెన్ కాళియమ్మ'గా, ఆ తర్వాత చెంగాళమ్మగా వ్యావహారికంలోకి వచ్చిందంటారు. ఆ తర్వాత ఆ విగ్రహాన్ని గ్రామానికి చేర్చి పూజలు చేయాలని సంకల్పించి ఎంతగా కదిలించినా కదలకపోవడంతో అమ్మవారి అద్భుతశక్తిని అర్థం చేసుకున్న గ్రామస్తులు అక్కడే అమ్మవారికి పూజలు చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న చోళరాజు ఈ విషయం తెలుసుకుని ఆస్థానశిల్పితో కలసి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారని, అమ్మవారి వామభాగంలో పార్వతి అంశ, దక్షిణ-మధ్య భాగాల్లో సరస్వతి, మహాలక్ష్మి అంశలతో అవతరించిన త్రికళలతో ఉండడంతో అమ్మవారు ఆదిశక్తిగా, అత్యంత శక్తివంతమైన దేవతగా నిర్ధారించుకుని అమ్మవారి చుట్టూ గర్భగుడిని నిర్మించారని చరిత్ర.

### నేటికీ తలుపులు లేని అమ్మవారి ఆలయం :

చెంగాళమ్మ అమ్మవారి గర్భగుడికి తలుపులు లేకపోవడం ఎంతో విశేషం. ఒకసారి గ్రామపెద్దలు అమ్మవారి ఆలయానికి తలుపులు తయారుచేయించేందుకు చెక్కలు సిద్ధంచేసి అక్కడున్న మద్ది చెట్టుకు వాటిని ఆనించిపెట్టగా మరుసటిరోజుకల్లా అవి చెట్టులో కలసిపోయాయి. అదేరోజు రాత్రి అమ్మవారు ఆలయపెద్దకు స్వప్నంలో కనిపించి తనను తలుపుల మధ్య బంధించకూడదని, భక్తులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పడంతో వారు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. నేటికీ అమ్మవారి గర్భగుడికి తలుపులు లేకుండానే ఉండడం అమ్మవారి మహిమకు ప్రతీక. ఆ చెట్టును 'చెంగాళమ్మ చెట్టు'గా వ్యవహరిస్తూ భక్తులు పూజలు చేస్తుంటారు. సంతానం లేని దంపతులు ఈ చెట్టుకు ముడుపులు కడితే సంతానప్రాప్తి కలుగుతుంది. చెంగయ్య, చెంగమ్మ, చెంగాళమ్మ, చెంగారెడ్డి.. చెంగల్రాయులు వంటి పేర్లన్నీ అమ్మవారి కృపకు గుర్తుగా పెట్టుకున్న పేర్లే.

### అపూర్వమైన రీతిలో సుళ్ళు ఉత్సవాలు :

కాలక్రమంలో అమ్మవారి తిరునాళ్లలో జరిగే సుళ్ళు ఉత్సవాలతో ఇది సుళ్ళూరుగా, ఆ తర్వాత అదే సూళ్ళూరుపేటగా మారిందని పెద్దలు చెప్తుంటారు. ఒక లావైన స్తంభంపై రాట్నం ఏర్పాటు చేసి, దానిలో ప్రాణంతో ఉన్న ఒక మేక పిల్లతో పాటు పసుపుబట్టలతో ఉన్న వడిబాలను, ఒక రోలు, నిలువెత్తు మనిషి బొమ్మ ఉంచి తొమ్మిది చుట్లు తిప్పుతారు. ఎంతో ప్రసిద్ధమైన వీటిని సుళ్ళు ఉత్సవాలు అంటారు. ఈ తిరునాళ్ళప్పుడు సూళ్ళూరుపేటకు ఇసకేస్తే రాలనంత భక్తజనం వస్తుంటారు.

చండీయాగాలు, మహాలక్ష్మీ యాగాలు, క్షీరాభిషేకాలు, పల్లకిసేవలు విశేషపూజలు పెద్దఎత్తున ఈ ఆలయంలో జరుగుతూనే ఉంటాయి.

వీక్షణం
- మంజీర

# పసుపునీళ్ళ ప్రభావం

రోజు ప్రశాంతంగా గడవాలంటే... గాంధీజీ మూడుకోతులు చెప్పే 'చెడు అనకు, చెడు కనకు, చెడు వినకు' సందేశాన్ని మళ్లీ మళ్లీ గుర్తు చేసుకోవాల్సి వస్తోంది. చెడు అనకుండా ఉండడం మన చేతిలో పనే, అలాగే చెడు కనకుండా ఉండడం కొంచెం ప్రయత్నపూర్వకంగా సాధించవచ్చు. కానీ చెడు వినకుండా ఉండడం ఎలాగో తెలియడం లేదు. టీవీ ఆన్‌చేస్తే చాలు... అబద్ధాల మేళవింపుతో పోపు పెట్టిన కథనాలతో చెవులు చిల్లులు పడిపోతున్నాయి. 'మూడు రాజధానులు అనే కాన్సెప్ట్ ప్రపంచంలో ఎక్కడైనా ఉందా' అని నిలదీస్తాడు ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ. అదే టెలివిజన్ చానెళ్లు సౌతాఫ్రికా మ్యాప్‌ను ఆ నాయకుడి ఎదురుగా పెట్టి ప్రిటోరియా, కేప్‌టౌన్, బ్లూమ్‌ఫౌంటియన్ నగరాలను చూపించే ప్రయత్నం చేస్తే బావుణ్ను. అలాగే మన దేశంలో ఎన్ని రాష్ట్రాల్లో హైకోర్టులు శాసనరాజధానికి దూరంగా ఇతర నగరాల్లో ఉన్నాయనే వాస్తవాన్ని కూడా ఎవరైనా పని గట్టుకుని ట్యూషన్ చెప్పాల్సినట్లుంది. ప్రపంచపటంలో హైదరాబాద్‌ను పెట్టింది తానేనని చెప్పుకునే నాయకుడు... అమరావతిని కూడా అదే పటంలో నోటిపై చేసి ఉండి ఉంటే ఆయనకు ఇప్పుడీ అగచాట్లు ఉండక పోయేవి.

## ఆంధ్రావనికి ఇదేం శాపం?

ఆంధ్రులు ఆరంభశూరులనే అపవాదును మోస్తున్నప్పటికీ చాలా విషయాల్లో దూరదృష్టితో, చాలా తెలివిగా ఉంటారు. అయితే రాజధాని విషయంలో ఆంధ్రులు పడినన్ని సార్లు బొక్కబోర్లా పడిన జాతి మరొకటి లేదనే చెప్పాలి. మొదట్లో... అంటే బ్రిటిష్ పాలన కాలంలో మద్రాస్ మనదే అనుకున్నారు. కాదని తెలిశాక 'అలో లక్ష్మణా' అంటూ ఆంధ్రకురికి రావాల్సి వచ్చింది. తెలుగు నేలకు రాజధాని కర్నూలా, గుంటూరా అనే ధర్మ సందేహం. కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు అని మధ్యేమార్గం. ఆ వెంటనే నిజాం పాలనలోని తెలుగు వాళ్లను కూడా కలిపేస్తున్నాం. మీకు రాజధాని హైదరాబాద్ అన్నారు కేంద్రంలో పెద్దలు. మళ్లీ అంతా పోలోమంటూ హైదరాబాద్ బాట పట్టాల్సి వచ్చింది.

మద్రాస్ నిర్మాణంలో ఆంధ్రుల మేధస్సు ఉంది, హైదరాబాద్ అభివృద్ధిలో ఆంధ్రుల రెక్కల కష్టం ఉంది. తెలంగాణతో కూడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండయింది. హైదరాబాద్ నగరం ఆంధ్రులది కాకపోయింది. మళ్లీ రాజధాని వేట మొదలు. ప్రపంచస్థాయి రాజధాని నగరానికి పంట పొలాల్లో పునాదులు పడ్డాయి. నిజం దేవుడెరుగుతాడో లేదోకానీ, నీరు పల్లమెరుగు అనే నానుడిని ఒక్క వానజల్లు నిజం చేసింది. సర్వకాల సర్వావస్థలందు ఇక్కడి నుంచే పరిపాలన చేయాలంటే ఏ పాలకుడికైనా కత్తిమీద సామే. ప్రజల సౌకర్యం కోసం, పాలన సౌలభ్యం కోసం ప్రత్యామ్నాయం చూడక తప్పదు. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు 970 కిలోమీటర్ల తీరాన్ని ఒక తాటి మీద నిలపాలంటే అందరికీ ఆమోద్యయోగ్యమైన పాలనను అందించాలి. అందరికీ పాలన సుగంధాలను అందించాలి. అందరికీ అభివృద్ధి ద్రాక్షను అందుబాటులోకి తీసుకురావాలి. అదే మూడు రాజధానుల ఆలోచనకు పునాది.

## ప్రజల్లో చైతన్యం

అభివృద్ధిని కేంద్రీకరిస్తే భవిష్యత్తులో ఏమి జరుగుతుందనే విషయంలో ప్రజలకు అవగాహన ఉంది. కొందరు కోరినట్లు అమరావతిలో అభివృద్ధి కేంద్రీకరణ జరిగితే... ఒకప్పుడు జడలు విప్పి ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిలోఉన్న రాయలసీమ ఉద్యమం భవిష్యత్తులో నిద్ర లేవవచ్చు. 'మేము వెనుకబడిపోతున్నాం... మాకు అన్యాయం జరుగుతోంది' అంటున్న ఉత్తరాంధ్రులు తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధం కావచ్చు. ఇప్పటికే మహారాష్ట్రలో విదర్భ, పశ్చిమ బెంగాల్‌లో సిలిగురిలు మా వెనుకబాటుకు కారణం పాలకుల దూరదృష్టి లోపమేనని వేలెత్తి చూపిస్తూనే ఉన్నాయి. ఆ సంగతి ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి తెలుసు. అభివృద్ధి ఫలాలను సమంగా పంచకపోతే రాష్ట్రం మరోసారి చీలిపోవచ్చు. భౌగోళికంగా వచ్చే చీలిక కాదు. ప్రజల మనసుల్లో దూరాలు కరడు గట్టిపోతాయి.

అమరావతిని కట్టే ప్రతి ఇటుకలోనూ మేము కట్టిన పన్నులున్నాయని, అభివృద్ధిలో మాత్రం చివరి పంక్తిలోనే ఉండాల్సి వస్తోందని అటు శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం వరకు ప్రతి ఒక్కరి గుండె ఆక్రోశిస్తుంది. ఆ ఆక్రోశానికి సమాధానమే అభివృద్ధి వికేంద్రీకరణ.

## రాజధాని రెండో జన్మభూమి

రాజధాని నగరం అంటే రాష్ట్రంలో అందరిదీ. ఏ మూల నుంచి వచ్చిన వాళ్లయినా ఆ నగరాన్ని తనది అనుకోగలగాలి. జన్మభూమి తర్వాత మరో జన్మభూమిలాగ ఆ నేలతో అనుబంధాన్ని పెంచుకోవాలి. కొత్తగా వచ్చిన వ్యక్తిని నగరం అంతలా కలుపుకోవాలి కూడా. ఆ కలుపుకునే తత్వం ఉన్న నగరాలే విస్తరిస్తాయి. బెజవాడ పరిసరాలు... ప్రతిపక్ష నాయకుడి హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నడిచిన ప్రదేశాలను పసుపు నీళ్ళతో శుద్ధి చేసుకున్నాయి. ఆ సంఘటన ప్రతి ఆంధ్రుడి మనసును ఏనాటికీ మరపునకు రాని విధంగా కలచి వేసింది. ఇది సమీప గతం. ప్రస్తుతానికి వస్తే వైజాగ్ వాసులు సోమవారం నాడు (03-08-2020) వైఎస్ఆర్ చేతికి (విగ్రహానికి) రాఖీ కట్టి పెద్దాయన మాలో బతికే ఉన్నాడని ప్రకటించారు. ఈ సంఘటనను కూడా జనం మర్చిపోలేరు. రాజధానుల వికేంద్రీకరణ ద్వారా రాయలసీమ వాసుల 'కర్నూలు త్యాగా'నికి 'న్యాయం' జరిగింది. భవిష్యత్తులో ఉద్యమాలు పురుడు పోసుకోకముందే ఉద్యమాలకు కారణమైన అసంతృప్తిని చల్లార్చడంలో ఉన్న దార్శనికత వ్యక్తమైంది. పదమూడు జిల్లాల వారినీ సమంగా సంతృప్తిపరచడం అనే విజ్ఞత ద్యోతకమవుతోంది. అభివృద్ధి సాధన... అధికార వికేంద్రీకరణతోనే సాధ్యమని గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు కూడా చెప్పి ఉన్నారు. బహుశా వయసు రీత్యా మర్చిపోయి ఉండవచ్చు. అధికార వికేంద్రీకరణలో మరొక ముందడుగే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న అభివృద్ధి వికేంద్రీకరణ నిర్ణయం.

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ కూడా 1983లో మరో రాజధానిగా తిరుచ్చిని అభివృద్ధి చేయాలనుకున్నారు. ఆయన పోవడంతో ఆ ప్రతిపాదన మరుగున పడిపోయింది. ఏపీలో మూడు రాజధానులకు గవర్నర్ ఆమోదముద్ర పడడంతో తమిళనాడు కూడా అదే బాటలో పయనించడానికి సిద్ధమవుతోంది.

## సెట్నెల్ సిఇఓగా రమేష్

నెల్లూరుజిల్లా సెట్నెల్ సిఇఓగా కె. రమేష్ నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలోని రీజనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయన్ను డెప్యుటేషన్‌పై ఇక్కడ సెట్నెల్ సిఇఓగా నియమించారు. గతంలో ఆయన నెల్లూరులో ఐటిడిఏ పి.ఓగా, మెప్మా పి.డిగా, నెల్లూరు బిసి కార్పొరేషన్ ఇ.డిగా పనిచేసి ఆ తర్వాత మాతృసంస్థకు బదిలీపై వెళ్ళారు. కడపలో ఆత్మ పీ.డిగా, శ్రీశైలం ఐటిడిఏ పి.ఓగా, కడప జిల్లాలో డ్వామా పి.డిగా పశ్చిమగోదావరి ఎస్సీ కార్పొరేషన్ ఇ.డిగా కూడా పని చేశారు.

## కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా నాగేశ్వరరావు

నెల్లూరు కార్పొరేషన్ సచివాలయం విభాగంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బి.నాగేశ్వరరావును అదనపు కమిషనర్‌గా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయన ఈనెల 3న ఆ బాధ్యతలు స్వీకరించాడు. గతంలో నాగేశ్వరరావు కదిరి, మైదుకూరు, పిఠాపురం, గొల్లప్రోలు మునిసిపాలిటీల్లో కమిషనర్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉంది కనుక అదనపు కమిషనర్‌గా కార్పొరేషన్‌లో నియమించినట్లు సమాచారం.

## ఎస్ఇగా రత్నాలరాజు

నెల్లూరు కార్పొరేషన్‌కు ఎస్ఇగా రత్నాలరాజును నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇంతియాజ్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందడంతో, విశాఖలో ఇఇగా పనిచేస్తున్న రత్నాలరాజును పదోన్నతిపై ఆ స్థానంలో నియమించారు.

## డెప్యూటి సిటీ ప్లానర్‌గా సుబ్బారావు

నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో డెప్యూటి సిటీ ప్లానర్‌గా బాబూరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల4న ఉత్తర్వులిచ్చింది. ఈ స్థానంలో ఉన్న హరిప్రసాద్‌ను నుడా ప్లానింగ్ అధికారిగా బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో నెల్లూరు టిపిఓగా పనిచేస్తున్న బాబూరావును కార్పొరేషన్‌లో డిసిపిగా నియమించి పూర్తిస్థాయి బాధ్యతలిచ్చారు.

# ఆయన విల్లివాక్కం యంజిఆర్!

## 10 రూపాయల డాక్టర్‌కి ఘన నివాళి



గత మాసం చెన్నైలో దివంగతుడైన వైద్య ప్రముఖుడు, 10రూపాయల డాక్టర్‌గా ప్రసిద్ధి చెందిన పేదోళ్ళ దేవుడు, మన నెల్లూరీయుడు డాక్టర్ చిల్లకూరు మోహన్‌రెడ్డి సంస్మరణ కార్యక్రమం ఆగస్టు 1వ తేదీ చెన్నైలోని మోహన్‌రెడ్డి కుటుంబానికి చెందిన మోహన్ గార్డెన్స్‌లో జరిగింది.

కఠిన తరమైన కోవిడ్ నిబంధనలు, ఆరోగ్యపరమైన భయాందోళనలు వున్నప్పటికీ అధిక సంఖ్యలో మోహన్‌రెడ్డి అభిమానులు, ఆరాధకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. మోహన్‌రెడ్డి సోదరుడు డాక్టర్ సియంకెరెడ్డి, సియంకె కుమారుడు డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ యంయల్ఏ జెసిడి ప్రభాకరన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల పేద ప్రజలను తన ప్రేమతో ఆకట్టుకుని వైద్యం అందించిన విల్లివాక్కం యంజిఆర్('అన్న') డాక్టర్ మోహన్ రెడ్డి అని కొనియాడాడు.



స్థానిక అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కన్నన్ మాట్లాడుతూ మానవత్వం మూర్తీభవించిన పరిపూర్ణ వ్యక్తిత్వం కలిగిన మహానుభావుడు మోహన్‌రెడ్డి అని, వైద్యుడంటే ఎలావుండాలలో, ఎలాంటి సమాజ సేవలు చెయ్యాలో చేసి చూపించి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు మోహన్‌రెడ్డి అని అన్నాడు.

ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి విగ్రహాన్ని, ఆయనపై రూపొందించిన సీడీని ఆవిష్కరించారు. వివిధ మతాలకు చెందిన మత పెద్దలచేత ప్రార్ధనలు చేయించారు. విల్లివాక్కంలోని మోహన్‌రెడ్డి నర్సింగ్‌హోమ్ ఇప్పుడు దేవుడు లేని కోవెలలాగా మౌనంగా రోదిస్తోంది.



## కాలధర్మం

# కైపు నాగిరెడ్డి



రవాణా వ్యాపారవేత్తగా నెల్లూరులో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి తరువాత కాలంలో ఆక్వా రైతుగా స్థిరపడిన కైపు నాగిరెడ్డి తన 82వ యేట కాలం చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో భాదపడుతుండిన ఆయన ఆగష్టు 1వతేది కన్నుమూశారు.

నాగిరెడ్డి స్వగ్రామం బోగోలు మండలం కోవూరుపల్లి. కైపు వెంకురెడ్డి, కమలమ్మల కుమారుడు నాగిరెడ్డి. 1938 జులై1న ఆయన జన్మించాడు. నాగిరెడ్డి రాజేశ్వరమ్మ దంపతులకు నలుగురు సంతానం, ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు. తన బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం ఐదున్నర దశాబ్దాల ముందే ఆయన నెల్లూరు రామమూర్తి నగర్‌లో కాపురంపెట్టి బిడ్డలందరిని ఉన్నత చదువులు చదివించాడు. బస్సులు, లారీలతో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం మొదలుపెట్టి నెల్లూరుజిల్లాలో గ్రామీణ ప్రాంతాలకే కాకుండా టౌన్లో కూడా ఆయన బస్సులను నడిపాడు. తరువాతి కాలంలో ఆర్‌టిసి బస్సుల రాజ్యం రావడంతో ఆ వ్యాపారానికి స్వస్తి చెప్పి ఆక్వా రంగంవైపు తన దృష్టిని మరల్చి, అదే వ్యాపారంలో స్థిరపడిపోయాడు.

దీర్ఘకాలం రామమూర్తినగర్‌లోనే వుండి ఆ తరువాత కొత్తగా అభివృద్ధి చెందిన రాంజీనగర్‌కి తన స్థిర నివాసం మార్చుకున్నాడు. పాతతరం మనిషైనా ఆధునిక భావాలు కలిగి వుండేవాడు, అయన కుమారుడు కైపు మల్లికార్జునరెడ్డి అమెరికాలో విప్రో సంస్థలో సీనియర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. నీతి నిజాయితీలతో సమాజంలో మంచి పేరు సంపాదించుకున్న నాగిరెడ్డి, దివంగత ప్రజానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డికి వీరాభిమాని. కైపు నాగిరెడ్డి మరణంతో దుఃఖసాగరంలో వున్న ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# మహా విశాఖే.. మన రాజధాని

(మొదటి పేజీ తరువాయి)

తాను అనుకున్నది సాధించడమే ఆయన లక్ష్యం. తలదించని నైజం, ఇచ్చిన మాట కోసం అప్పట్లో అత్యంత శక్తివంతమైన మహిళ సోనియానే లెక్క చేయలేదు, దాంతో కేసులు, జైలు... అంతా అస్తవ్యస్తం. అయినా వెన్ను చూపలేదు. ఓడిన చోటే గెలవాలనుకున్నాడు, అదేమీ అంత సులభంగా సాధ్యమయ్యే పని కాదు... దానికి ఒక సుదీర్ఘ ప్రణాళిక వేసుకున్నాడు, ఓపికగా కష్టాలను భరిస్తూ ముందుకు సాగాడు, విజయం సాధించాడు, అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు. తాను హామీ ఇచ్చిన పథకాలకు డబ్బుల్లేవు, ఎలా చేస్తావ్ అన్నారు, ఎవరూ నోరెత్తలేని విధంగా సంతృప్తికర స్థాయిలో చేస్తున్నాడు. పాలనలో అనుభవం లేదన్నారు, రివర్స్ టెండరింగ్ నుంచి గ్రామ సచివాలయాలు, వాలంటీర్లు, దిశ పోలీస్ స్టేషన్లు, సమస్యల పరిష్కారానికి స్పందన, విద్య వైద్య రంగాల్లో అపారమైన సంస్కరణలు... జయహో జగన్ అనిపించుకునే విధంగా నిర్ణయాలు తీసుకుంటూనే వున్నాడు.

ప్రస్తుతం ఆయనపై ఉండే విమర్శ అభివృద్ధి ఏదీ? అని. జగన్‌ని చూసి ఎవరూ పెట్టుబడులు పెట్టడానికి రావడం లేదు అని.. అందులో భాగమే తాజా పరిణామం.

సీఆర్డీఏ చట్టం రద్దు, ఆపై మూడు రాజధానుల ఏర్పాటు... ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కల... ప్రస్తుతం అది ఆవిష్కృతమౌతోన్న తరుణం ఇది. వైజాగ్ రాజధానిగా పారిశ్రామిక సేవా రంగాలలో అభివృద్ధిని పరుగులు పెట్టించాలన్నది ఆయన వ్యూహం.

- **మూడు రాజధానుల ఏర్పాటుకై సుదీర్ఘ కసరత్తు**
- **శాసన రాజధానిగా మిగిలిపోనున్న అమరావతి**

*ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక కీలక అధ్యాయానికి, కొత్త చరిత్రకు నాంది పలికే నిర్ణయాన్ని జూలై 30 న రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ తీసుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధానిగా ఉన్న అమరావతి ఇక నుంచి శాసన రాజధానిగా మారబోతోంది. రాష్ట్ర పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూల్‌ని ఏర్పాటు చేస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. గత కొంత కాలంగా పెండింగ్ లో ఉన్న సీఆర్‌డీఏ-2014 రద్దు, వికేంద్రీకరణ-ప్రాంతీయ సమానాభివృద్ధి బిల్లు, పాలనా వికేంద్రీకరణ బిల్లులకు గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ ఆమోదం తెలిపారు. రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపిన బిల్లుకు గవర్నర్.. తన ఆమోదముద్ర వేశారు. తాజా నిర్ణయంతో ఇకపై పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం, శాసన రాజధానిగా అమరావతి, న్యాయ రాజధానిగా కర్నూలు ఏర్పడనున్నాయి.*

## మూడు రాజధానులు

ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఏనాడూ వెనకడుగు వేయలేదు. ఇది అసాధ్యం అన్నారు, శాసనమండలిలో అడ్డుకునే ప్రయత్నం బలంగా చేశారు, అయినా వెనక్కి తగ్గలేదు. మౌనంగా తన పథకాన్ని అమలు చేశాడు, గవర్నర్‌ని ఒప్పించాడు. ఇంకా అడ్డంకులు పెడతారని తెలుసు, అయినా శాసన నిర్ణయం కాబట్టి ఇక తిరిగి చూడక్కర్లేదన్నది జగన్ ధీమా. ఇది కేవలం రాజకీయ కోణంలో తీసుకున్న నిర్ణయం కాదని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇది కీలక ప్రయోగం అన్నది జగన్ ఆలోచన.

శ్రావణ మాసంలో రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం లాంటి అతిపవిత్రమైన రోజున రాష్ట్ర గవర్నర్ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర చరిత్రలో కీలక మలుపు కాబోతోంది. సీఆర్డీఏ చట్టం రద్దు, పాలనా వికేంద్రీకరణ.... ఈ రెండే మన రాష్ట్ర భవిష్యత్‌ని శాసించబోతున్నాయ్. వీటిల్ని అడ్డుకోవడానికి ప్రతిపక్షం చేయని ప్రయత్నం లేదు. ఈ నిర్ణయం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సంబంధించింది. అన్ని వర్గాల ప్రజల భవిష్యత్‌తో ముడిపడి వుంది. ఇందులో రాజకీయం లేదు, గతంలో జరిగిన తప్పిదాలను సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ తప్పులను సరి చేస్తారనే నమ్మకంతోనే జగన్‌కి బలమైన మద్దతు ప్రకటించారు రాష్ట్ర ప్రజలు. చివరకు రాజధాని జిల్లాలైన గుంటూరు, కృష్ణా జిల్లాల్లో కూడా వైసీపీ శాసనసభ్యులనే అత్యధికంగా గెలిపించారు... ఎంతగా అంటే గుంటూరులో మొత్తం 17 స్థానాలకు 15, కృష్ణాలో మొత్తం 16 స్థానాలకుగాను 14, అంటే రెండు జిల్లాల్లో మొత్తం 33 స్థానాలకు 29 స్థానాల్లో వైసీపీ శాసన సభ్యులు గెలిచారంటే అర్థం ఏంటి? ఇంతకంటే ఆమోదం కావాలా? ఇది ప్రజాభీష్టం కాదా? అయినా గడచిన 5 సంవత్సరాల కాలంలో గ్రాఫిక్స్ కాకుండా ఏమైనా చేశారా అన్నది సామాన్య ప్రజల మాట. అవికూడా జనాన్ని నమ్మించేంత గ్రాఫిక్స్.

ఎంతంటే.... ఇప్పటికీ విదేశాల్లో ఉన్న చాలామంది తెలుగు వారు ఆ స్థాయిలో అక్కడ అద్భుత నగరం నిర్మిస్తే అది కాదని వైజాగ్ ఎందుకు అని ప్రశ్నిస్తుంటే, మరికొంతమంది ఏకంగా ఆ గ్రాఫిక్స్ నిర్మాణాలను చూడటానికి అమరావతి వచ్చి తిరిగి తిరిగి అవి కనపడక భంగపడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి.

కేవలం తన వారికోసం, తన బినామీల కోసం అమరావతి రైతులను చంద్రబాబు మోసం చేశాడు అన్నది అధికార పార్టీ ఆరోపణ. ఇప్పటికైనా చంద్రబాబుని నిలదీయాలి, అలాగే అక్కడి రైతుల సమస్యలపైనా మా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది, ఎవ్వరికీ అన్యాయం చేసే పరిస్థితి జగన్ ప్రభుత్వంలో ఉండదు. .... అన్నది అధికార పార్టీ వాదన.

## విశాఖే బెస్ట్

మరోవైపు విశాఖ ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతోన్న ప్రపంచ నగరాల్లో చాలా ముందుంది. ఇప్పుడు ఇంకా అంతర్జాతీయ స్థాయీ మౌళిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంటుంది. తద్వారా ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికీకరణ వేగవంతం అవుతుంది, పెట్టుబడులు రాబట్టుకోవడానికి ఆకర్షణీయమైన పారిశ్రామిక పాలసీ కోసం ప్రభుత్వం మధనం చేస్తోంది. భారీగా పెట్టుబడులు రాబోతున్నాయి... మరోవైపు ఇందుకోసం జగన్ వద్ద ప్రత్యేక వ్యూహాలు, ప్రణాళికలు ఉన్నాయని చెప్తున్నారు. ఇవన్నీ త్వరలోనే సాకారం కాబోతున్నాయి. దాని ద్వారా పర్యాటకం, సేవా రంగాలు వృద్ధి చెందుతాయి, రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి... భవిష్యత్ ఇకపై బంగారుమయం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు అన్నది అధికారపార్టీ ధీమా.

## అవరోధాలు తాత్కాలికమే

అయితే అమరావతి రైతుల విషయంలోనూ ప్రభుత్వం సీరియస్‌గానే ఆలోచిస్తోంది. తమ ఆస్తులకు విలువ పెరుగుతుందని భంగపడ్డ రైతులకు ఎలా ప్రత్యామ్నాయం చూపాలని చూస్తోన్న తరుణంలోనే రైతులు కోర్టు మెట్లెక్కారు. ఇక్కడే మళ్లీ గ్యాప్ వస్తోంది. కోర్టుకి వెళ్లకుండా ప్రభుత్వంతోనే చర్చలు జరపాల్సింది రైతులు. అలాకాకుండా ప్రత్యేక అజెండాతో వాళ్ళు టీడీపీ నాయకత్వంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో సమస్య ఇంకా జఠిలమౌతుంది. ఇలాంటివి జగన్‌కి నచ్చవు అన్నది ఆయన వ్యవహారశైలి చెప్పకనే చెప్తోంది. కోర్టు తాత్కాలికంగా స్టేటస్‌కో ఇచ్చినా మూడు రాజధానుల నిర్ణయానికి ఇబ్బందేమీ ఉండదు. ఇది పాలనా పరమైన రాజకీయ నిర్ణయం, విధానపరమైన శాసన నిర్ణయం, ఆ స్వేచ్ఛ ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలకు ఉంటుంది. న్యాయ సమీక్షలో అది నెగ్గుతుంది, కాకపోతే రైతుల హక్కులపై ప్రభుత్వం నుంచి హామీని కోర్టు కోరే అవకాశం ఉంది, అందుకోసం ఇప్పటికే సీఆర్‌డీఏ స్థానంలో తీసుకొచ్చిన అమరావతి మెట్రో డెవలప్మెంట్ అథారిటీ ప్రభుత్వం తరపున హామీ ఇస్తుంది, ఇప్పటికే ఆ బాధ్యతలన్నీ సీఆర్డీఏ నుంచి ఏఎమ్మార్డీఏ కి ప్రభుత్వం బదిలీ చేసింది, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత దానిదే కాబట్టి కోర్టుల నుంచి పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చున్నది న్యాయ కోవిదుల అభిప్రాయం. ఈ తాత్కాలిక అవరోధాలన్నీ విజయవంతంగా అధిగమించి విశాఖకు మకాం మార్చడం కొద్దిరోజుల్లోనే అవిష్కృతం కాబోతుందన్నది వాస్తవం.

# పెంచలకోన లక్ష్మీనృసింహస్వామి హుండీ రాబడి 61.58 లక్షలు

పెంచలకోనలో కొలువైవున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 3న హుండీ కానుకలు లెక్కించగా 2020 ఫిబ్రవరి 10 నుంచి ఈనెల 3 వరకు భక్తులు నగదు రూపంలో సమర్పించిన కానుకలు 61,58,078 రూపాయలు వచ్చాయని ఆలయ ఏసి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. 830 గ్రాముల బంగారం, 3 కేజీల 800 గ్రాముల వెండితో పాటు 30 అమెరికా డాలర్లు, 9 కువైట్ దీనార్లు, ఇంగ్లాండ్ పౌండ్ 1, సౌదీ అరేబియా రియాల్స్ 2 భక్తులు స్వామివార్లకు కానుకలుగా సమర్పించారన్నారు. ఈ లెక్కింపులో దేవాదాయశాఖ జిల్లా సహాయక కమిషనర్ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ చైతన్య, హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

- **లాయర్ వార్తకు స్పందన**

*అటు నేతలు ఇటు అధికారులూ గోపాలరెడ్డి గారిని విస్మరించారని, కనీసం అయన పుట్టిన రోజుని, చనిపోయిన రోజుని పట్టించుకోవడం లేదని గత వారం 'లాయర్'లో వచ్చిన వార్తకు మాగుంట శీనయ్య, చేవూరు దేవకుమార్‌రెడ్డి స్పందించారు. కనీసం వీళ్ళని చూసైనా మిగిలిన నేతలు, అధికారులు చలించి రాబోయేకాలంలో ఆగస్టు5న, మార్చి9న వచ్చే గోపాలరెడ్డి గారి జయంతి - వర్ధంతిలను గుర్తించి ఆయనను గౌరవిస్తారని ఆశిద్దాం!*

# చిరస్మరణీయుడు గోపాలరెడ్డి

## - సంస్మరించుకున్న మాగుంట శీనయ్య



బెజవాడ గోపాలరెడ్డిగారి 113వ జయంతి సందర్బంగా, అయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఒంగోలు పార్లమెంటుసభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, గోపాలరెడ్డి విగ్రహ కమిటీ ముఖ్యసమన్వయకర్త లాయర్ పత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి(ప్రభు).

డా. బెజవాడ గోపాలరెడ్డి గారి 113వ జయంతి సందర్భంగా ఆగస్టు 5వ తేదీ బుధవారం ఉదయం రాజకీయ నేతలు, పార్టీలు ఆయనను స్మరించుకున్నారు.

ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని మాగుంట లే అవుట్ ప్రాంతంలో బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్‌లో గల గోపాలరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఆయనను సంస్మరించుకున్నాడు.

ఈ సందర్భంగా శీనయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్ గా బెజవాడ గోపాలరెడ్డి గారు ప్రజా జీవితంలో అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమని అన్నాడు. ఆగస్టు 5న అయన 113వ జయంతి సందర్భంగా అలాంటి మహనీయుడిని స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నాడు. ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో అనేక నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాణం పోసిన ఘనత గోపాలరెడ్డి గారిదేనని, తమ అన్న మాగుంట సుబ్బరామరెడ్డికి మామగారిగా, వదిన పార్వతమ్మకు స్వయానా పెదనాన్నగా తమ కుటుంబానికి ఆయన పెద్ద దిక్కుగా మార్గ నిర్దేశకుడిగా ఉండేవారని శీనయ్య అన్నాడు. స్ఫూర్తివంతమైన ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయసాధనలో ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు సమాజసేవకై అంకితం కావాలని పిలుపునిచ్చాడు.


# కాంగ్రెస్ పార్టీ నివాళి



జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సర్ఫరాజ్ షబ్బీర్, జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పప్పర్తి గణేష్‌బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్ తదితరులు గోపాలరెడ్డి గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌పార్టీ అభ్యున్నతికి, వివిధ ఉన్నత పదవుల్లో జిల్లా అభివృద్ధికి గోపాలరెడ్డిగారు చేసిన కృషి మరువలేనిదని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

హలో.. సుబ్బయ్యా బాగున్నావా..

# హోదాతో దూరమైనా.. హృదయంతో దగ్గరవుతున్నాడు



- నోటుకన్నా.. ఓటుకన్నా.. మాటకే విలువెక్కువని రుజువు చేస్తున్న మన వెంకయ్య

***హలో... సుబ్బయ్యా బాగున్నావా..? హలో... శివారెడ్డీ నేను వెంకయ్యనాయుడిని మాట్లాడుతున్నా..! హలో గురువుగారు నేను మీ స్టూడెంట్‌ని గుర్తుపట్టారా..? ఇలా జిల్లాలోని వెంకటగిరి, ఉదయగిరి తెలంగాణలోని భువనగిరి, యాదగిరి ఆంధ్రలోని ఉభయ గోదావరి ప్రాంతాలవాసులనే కాకుండా భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వున్న తన చిన్ననాటి నేస్తులని, హితులని సన్నిహితులని నిత్యం పలకరిస్తూ తాను ఉపరాష్ట్రపతి గిరిలో వున్నా తన చుట్టూ గిరిగీసుకోకుండా, ఓటుకన్నా నోటుకన్నా నోటి మాటకే విలువెక్కువని రుజువు చేస్తున్నాడు భారత ఉపరాష్ట్రపతి మన వెంకయ్యనాయుడు.***

వెంకయ్య ఇప్పుడు రాజకీయ నాయకుడు కాదు, ప్రజలకి ఆయన నోటు ఇవ్వాల్సిన అవసరం లేదు, ప్రజలు ఆయనకి ఓట్లు వేయాల్సిన పని అసలే లేదు.. అత్యున్నత రాజ్యాంగ పదవులలో రెండవదైన ఉపరాష్ట్రపతి పదవి ఆయననే వెతుక్కుంటూ వచ్చి వరించింది.

ఇప్పుడు ఆయన హోదా సామాన్యమైనది కాదు, మామూలు సాదాసీదా వ్యక్తి భారత ఉపరాష్ట్రపతితో మాట్లాడాలంటే కలలోనైనా జరిగే పని కాదు. కానీ వెంకయ్య తన ఆత్మీయుల పట్ల, అనుయాయుల పట్ల, తనతో పాటు చిన్నప్పుడు ఆటలాడుకున్న స్నేహితులపట్ల, తనతోపాటు చదువుకున్న సహాధ్యాయుల పట్ల, తనతోపాటు ఉద్యమాలలో పాల్గొన్న సహచరుల పట్ల, కష్టకాలంలో తనకు అండగా నిలిచిన శ్రేయోభిలాషుల పట్ల, తనతో పాటు భారతీయ జనతా పార్టీకోసం తమ కష్టాన్ని ధారబోసిన కార్యకర్తల పట్ల, తనకు చదువు చెప్పిన గురువుల పట్ల అపార ప్రేమాభిమానాలను చూపిస్తున్నాడు.

తన హోదాతో తాను వారికి దూరమయ్యాననే భావన వారికి రానీయకుండా తన హృదయంతో వారికి దగ్గరగా వుంటూ 'నేనెప్పటికీ మీ వెంకయ్యనే' అని చెప్పకనే చెప్తున్నాడు.

కోవిడ్ నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలతో కుంగిపోయి వున్న చాలామందికి వెంకయ్య మాట ఊరట కలిగించడమే కాకుండా కొండంత ధైర్యాన్ని నూరిపోస్తుందని ఆయన మిత్రులు చెప్తున్నారు.

గల్లీ నుండి ఢిల్లీ స్థాయికి ఎదిగినా మా వెంకయ్య ఎదిగేకొద్దీ ఒదుగుతున్నాడని, తాము కలలో కూడా ఊహించని విధంగా 'సంగమం' పేరుతో తన ఇంట ఆత్మీయ సమావేశం పెట్టి తమనంతా ఢిల్లీకి పిలిపించుకుని 3రోజులపాటు తనతోనే ఉంచుకుని తానే స్వయంగా వచ్చి పార్లమెంటు భవనాలను చూపించడం, తానే కొసరి కొసరి వడ్డించడం వంటివి మరువలేని అనుభూతులుగా గుర్తు చేసుకుంటుంటే, ఇప్పుడు స్వయంగా ఆయనే అందరికీ ఫోన్ చేసి క్షేమసమాచారాలు తెలుసుకుని ఏం భయపడకండి అన్నీ సర్దుకుంటాయి ధైర్యంగా వుండండి అని చెప్పడంతో తమకు కొండంత ధైర్యంగా ఉందని వాళ్ళు చెప్తున్నారు. మా వెంకయ్య మాతోవున్నాడన్న భరోసా మాకుంటే ఇలాంటి కరోనాలు ఎన్నివచ్చినా మమ్మల్నేమీ చెయ్యలేవన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## జననీ జన్మ భూమిశ్చ...

కన్నతల్లిని జన్మభూమిని మరిచినవాడు మనిషిగా జీవించడానికి అర్హుడు కాదు అని వెంకయ్య పలు సభలలో చెప్తూనే ఉంటాడు.


ఆయన తన కన్నతల్లిని ఎంతగా ఆరాధిస్తాడో తన జన్మభూమిని కూడా అంతే ప్రేమిస్తాడు. జిల్లా అధికారులను కూడా నిత్యం పలుకరిస్తుంటాడు, జిల్లాలో ఎక్కడైనా సమస్య తన దృష్టికి వస్తే ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాడు. ఇటీవల చంద్రపడియ ఫ్యాక్టరీ ప్రమాదం గురించి ఆరా తీశాడు, రోగాల బారిన పడుతున్న గ్రామాల గురించి విచారించాడు. ప్రజల యోగక్షేమాలే అజెండాగా అధికారులు పనిచేయాలని సూచిస్తూ వున్నాడు. వెంకయ్యకు జన్మనిచ్చిన నెల్లూరు పుణ్యభూమి అయితే, నెల్లూరులో జన్మించిన వెంకయ్య ధన్యజీవి ...!

---

నాకూ వచ్చింది కరోనా..

# అక్కర్లేదు హైరానా

యస్.పి.బాలు వీడియో సందేశం



తనకి కరోనా లక్షణాలు స్వల్పంగా కనిపించాయని, పరీక్ష చేయించుకుంటే తక్కువ స్థాయిలో ఇన్ఫెక్షన్ వున్నట్లుగా బయటపడిందని భారతీయ సినిమా గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం తనను అభిమానించే భారతీయులందరికి వీడియో సందేశం ద్వారా తెలియజేశాడు. తనకు కరోనా వచ్చిందని ఎవరూ హైరానా పడవద్దని, డాక్టర్లు తనను ఇంటి వద్దే వుండి వైద్యం చేసుకోమంటే తనకై తానే ఆసుపత్రిలో చేరానని, దయచేసి ఎవరూ తనకు ఫోన్ చేయడం లేదా, కలుసుకునే ప్రయత్నం కానీ చెయ్యొద్దని ఆయన ఈ వీడియో సందేశం ద్వారా విజ్ఞప్తి చేశాడు.

భారతీయుల ముద్దుబిడ్డ, గాన గంధర్వుడు త్వరగా కోలుకుని తన మధుర గానంతో కరోనాని తరిమి కొట్టాలని సంగీత ప్రియుల ఆకాంక్ష.

---

# శ్రద్ధాంజలి



జననం : 10.09.1935 మరణం : 01.08.2020

## సూరెడ్డి సుగ్రీవరెడ్డి

ఆకస్మిక మరణానికి చింతిస్తూ...
నాన్న దూరమై అశ్రునయనాలతో ఉన్న
ఆప్తమిత్రుడు **శ్రీనివాస్**కి
ఇతర కుటుంబ సభ్యులకు
గుండె నిబ్బరాన్ని ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం.

**- స్నేహితులు**

---

# రైతే రాజు కావాలన్నదే జగనన్న లక్ష్యం



**- ఎమ్మెల్యే సంజీవయ్య**

రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతులను రారాజులుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని, అందుకే రైతుల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నాడు. ఈనెల 5న ఆయన నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా రాధాకిషోర్‌యాదవ్, వైస్‌ఛైర్మెన్‌గా రఘుబాబు, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి జగనన్న ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నాడు. గతంలో రుణమాఫీ పేరు చెనెరప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఆ తర్వాత రైతులకు ఏమీ చేయకుండా మోసం చేశాడని, అమరావతి పేరుతో భారీగా అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని విమర్శించాడు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుం టున్నాడని మండిపడ్డాడు. ముఖ్యమంత్రి జగన్ పట్ల ప్రజలంతా అభిమానం చూపుతున్నారని చెప్పాడు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com